
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

గురువారం 29 మే 2025



పుట్టిన ప్రతీ బిడ్డకు ఎత్తు, బరువు చూడాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతీ బిడ్డకు కచ్చితమైన ఎత్తు, బరువు నమోదు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం జరిగింది. ఈ ఆయన మాట్లాడుతూ తక్కువ బరువున్న శిశువులకు సరైన పోషణ, వైద్య సేవలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సమయంలో పిల్లల శారీరక వృద్ధిని పర్యవేక్షించాలన్నారు. వృద్ధి రేటు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలని, పోషకాహారం, వైద్యసేవలు అందించి సాధారణ స్థితికి వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈసారి రోహిణిలో
రోళ్లు పగలవ్!

వేసవి వచ్చిందంటే చాలు ప్రచండ భానుడి ప్రతాపానికి జిల్లా నిప్పుల కొలిమిలా మారుతుంది. ముఖ్యంగా మే నెలలో ఎండల తీవ్రతకు ప్రజలు విలవిల్లాడిపోతారు. ఇక రోహిణి కార్తె వచ్చిందంటే మరింత హడలిపోయేవారు. ఎండల ధాటికి జనం నీరసించడంతోపాటు రాత్రుళ్లు కూడా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసేది. కానీ ఈ ఏడాది మాత్రం జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. 'రోహిణి కార్తెలో రోళ్లు పగులతాయి.' అనే నానుడికి ముగింపు పలికినట్టుంది. ఈ నెల 25వ తేదీ ఆరంభమైన రోహిణి కార్తె జూన్ 15వ తేదీ వరకు ఉంటుంది.ఈ కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు, రాత్రిపూట వేడిగాలులు వీస్తాయి. మే నెలలో పగటి ఉష్ణోగ్రత 42 నుంచి 46 డిగ్రీల వరకు చేరుతుంది. అయితే ఈసారి మాత్రం జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. నిప్పుల కణికలు కురిపించే రోహణిని కారుమేఘాలు కమ్ముకున్నాయి. ముందే నైరుతి పలకరించడంతో భానుడి భగభగలకు తెర పడింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి, చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. జిల్లాలో వారం రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మొత్తం మీద పరిశీలిస్తే ఉష్ణోతలు అనూహ్యంగా తగ్గాయి. బుధవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత 34, అత్యల్పం 29 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. నైరుతి రుతుపవనాలు ముందుగా పలకరించడంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమవుతోంది. రుతుపవనాలు ముందస్తు రాకతో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



వలేటివారిపాళెం : అంకభూపాలపురం నుంచి కడపకు తరలివెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దారులన్నీ కడప వైపే!

ఐదేళ్ల అణచివేత తరువాత అధికారాన్ని చవిచూసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు మహానాడు ఉత్సవానికి ఉత్సాహంగా తరలివెళుతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న తొలి మహానాడులో ప్రతిష్ఠాత్మకంగా గురువారం నిర్వహించే బహిరంగ సభలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి జిల్లా నుంచి వేలాదిగా కదలి వెళుతున్నారు. కార్యకర్తల్లో పెల్లుబికుతున్న ఉత్సాహాన్ని మహానాడు ముంగిట వరకు తీసుకెళ్లడానికి వందల సంఖ్యలో ప్రభుత్వ ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. అంతకు రెట్టింపు సంఖ్యలో సొంత వాహనాల్లోనూ ద్వితీయశ్రేణి నాయకులు, క్రియాశీల కార్యకర్తలు, అభిమానులు కడప దిశగా పోటెత్తుతున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- మహానాడుకు వేలాదిగా తరలుతున్న టీడీపీ శ్రేణులు
- ఆర్టీసీ బస్సులు 250.. ఇతర బస్సులు వందల్లోనే!
- ఇక సొంత వాహనాల్లోనూ సభకు పయనం

పార్టీ శ్రేణులను కడపకు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను బుధవారం సాయంత్రానికే పూర్తి చేసుకున్నారు. అర్ధరాత్రికల్లా వాహనాలు నిర్దేశిత పల్లెలకు, పట్టణ ప్రాంతాలకు చేరుకుంటాయి. బుధవారం ఉదయం 6 గంటలకు జిల్లా నుంచి కడపకు బయలుదేరనున్నాయి. మహానాడు బహిరంగ సభకు అవసరమైన వాహనాలను సమకూర్చుకునే విషయంలో టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీకి కొంత మినహాయింపు ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో సీఎం బహిరంగ సభ జరిగితే ఆ సమీప జిల్లాల పరిధిలోని మెజారిటీ ఆర్టీసీ బస్సులన్నీ జనాలను తరలించడానికి వినియోగించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో కేవలం 250 బస్సులను మాత్రమే కోరింది. 5వేలకుపైగా ప్రైవేటు బస్సులు, వ్యాన్లను సమకూర్చుకుంది. ఒక్కో నియోజకవర్గం నుంచి 5-7వేల మందిని మహానాడుకు తరలించడానికి అవసరమైన వాహనాలను ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు సొంతంగా సమీకరించుకున్నారు.

- నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి మంత్రి నారాయణ నాయకత్వంలో 5వేల మంది మహానాడుకు తరలివెళుతున్నారు. ఉదయం ఆరు గంటలకు ఈ వాహనాలు బయలుదేరుతున్నాయి.
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 15 వేల మందిని తరలిస్తున్నారు.
- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో 10వేల మంది, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో 7వేల మంది, సర్వేపల్లి నుంచి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంలో 6వేల మంది, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో 6 వేల మంది, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నేతృత్వంలో 5వేల మంది, కందుకూరు నుంచి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నాయకత్వంలో 2 వేల మంది మహానాడుకు వెళుతున్నారు.
- ఇక ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా వందలాదిగా టీడీపీ అభిమానులు సొంత వాహనాల్లో కడపకు తరలివెళుతున్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు

జయహో ఎన్టీఆర్!

- ఘనంగా నందమూరి జయంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిని ప్రభుత్వం రాష్ట్ర పండువగా ప్రకటించడంతో అధికారికంగా వేడుక జరిపారు. కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, జేసీ కార్తీక్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజకీయ, సినీ రంగాల్లో ఆయన ఘనతను కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను కలెక్టర్ ఆనంద్ సత్కరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ జయంతిని పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా జరిపారు.

6

అంతా గందరగోళం!



సర్దుబాటు ప్రక్రియలో కాంట్రాక్టు సిబ్బందికే ప్రాధాన్యం

రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్ల ఆందోళన

రేపటికి వాయిదా


నెల్లూరు (వైద్యం), మే 28 (ఆంధ్రజ్యోతి) : కీటక జనీత వ్యాధుల నియంత్రణలో హెల్త్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. అలాంటి వారిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సర్దుబాటు చేసి అవసరమైన చోట నియమించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే చాలా జిల్లాల్లో ఈ ప్రక్రియ జరిగిపోగా, నెల్లూరు జిల్లాలో మాత్రం 27వ తేదీన జరిగిన కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల జాబితా తయారీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించారంటూ రెగ్యులర్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకే ప్రాధాన్యత ఇచ్చి జాబితా తయారు చేశారని ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు బదులివ్వడంతో ఆ ఉత్తర్వులు చూపాలని హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. దీంతో ఈ ప్రక్రియను వాయిదా వేసి, 30న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ సర్దుబాటు జరుగుతుండగా, రెగ్యులర్ ఉద్యోగులు 115 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 119 మంది ఉన్నారు. వీరిలో 12 మంది

- మిగతా 5లో..

సినిమా హాళ్లపై రెవెన్యూ దాడులు 5

'కలెక్టర్ ఇంటర్న్‌షిప్'లో చేరండి

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ గ్రాడ్యుయేట్ యువతను ఓ ప్రకటనలో కోరారు. గ్రాడ్యుయేట్లు, ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరవచ్చని తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ సైన్సెస్, డెవలప్‌మెంట్ స్టడీస్‌లోగానీ, ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. 3 నుంచి 6 నెలల కాలవ్యవధితో చేసే ఈ ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రభుత్వంలో నేరుగా పనిచేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పనితీరును నేరుగా పరిశీలించి, జిల్లా స్థాయి అధికారులతో మమేకమై, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ విధానాలను విశ్లేషించడం, క్షేత్రస్థాయి సమ్యలకు పరిష్కారాలు కనుక్కోవడం తదితర కార్యకలాపాలతో ఈ ప్రోగ్రాం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు జూన్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంతృప్తికరంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.



అమ్మగారు వస్తున్నారహో!

బయటకు వస్తేచాలు కార్పొరేషన్ ఉద్యోగుల్లో హడల్

షాపింగ్ ఖర్చులన్నీ వీరే భరించాలట!

డబ్బుల్లేవంటే.. బెదిరింపు ధోరణిలో మాటలు

నెల్లూరు నగర పాలక సంస్థలో ఆయనో ఉన్నతాధికారి. సార్.. అంటేనే కాదు.. ఆయన సతీమణి మేడం అన్నా హడలిపోతున్నారు. ఇంటిలో నుంచి మేడం బయటకు వస్తున్నారని తెలిస్తే చాలు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల మొదలు ఆర్‌ఐల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఆమె ఎక్కడకు వెళ్లి ఏం కొంటారోనని బీతిల్లుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ఇటీవల ఆమె హ్యాండ్ క్రాఫ్ట్ తయారీ వస్తువుల కొనుగోలుకు ఓ షాపులోకి వెళ్లారు. పింగాని ప్లేట్ల నుంచి మొక్కలు పెట్టుకునే కుండీల వరకు అన్నీ కొనుగోలు చేశారు. మొత్తం రూ.17 వేల వరకు ఖర్చయింది. ఈ మొత్తం బిల్లు చెల్లించాలని అక్కడే ఆర్‌ఐను పిలిచి ఆదేశించారు. అయితే, సదరు ఆర్‌ఐ వద్ద అంత నగదు లేకపోవడం మేడం గారిలో ఆగ్రహం తెప్పించింది. 'మా ఆయన నీకు ఆర్‌ఐగా పోస్టింగ్ ఇప్పిస్తే ఆ మాత్రం ఖర్చుపెట్టలేవా!?' అంటూ మండిపడ్డారు. దీంతో సదరు అధికారి చేసేది లేక స్నేహితుల వద్ద నగదు తెప్పించుకుని షాపు యజమానికి చెల్లించాడు. కాగ ఆ వస్తువులన్నిటినీ ప్రత్యేక వాహనంలో తన అమ్మగారింటికి తరలించడం గమనార్హం.

- ఇంట్లో 20 మందితో సేవలు

కార్పొరేషన్‌కు చెందిన ఆ అధికారి నివాసం ఉంటున్న ఇంట్లో 20 మంది సిబ్బందితో సేవలు చేయించుకుంటున్నట్లు సమాచారం. కేవలం వంట కోసమే మధ్యాహ్నం వరకు నలుగురు, మధ్యాహ్నం నుంచి మరో నలుగురు ఉండగా, మరుగుదొడ్ల శుభ్రతకు ఒకరు, గార్డెన్ క్లీనింగ్‌కు మరొకరు, ఇల్లు శుభ్రతకు ఓ మహిళ, అధికారి అవసరాలకు మరో ఇద్దరు, పాత్రలు శుభ్రం చేసేందుకు ఏకంగా నలుగురు, వాచ్‌మెన్‌లుగా ముగ్గురు కొనసాగుతున్నారు. వీరంతా కార్పొరేషన్ ఖజానా నుంచి జీతాలు పొందుతుండటం విశేషం.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



నెక్లెస్ రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితరులు

ఆరోగ్య యోగా

'యోగాంధ్ర'కు విశేష స్పందన

21న 10 లక్షల మందితో యోగా : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని నెక్లెస్ రోడ్డుపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెకర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ మొదలు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. ప్రతీ ఒక్కరు యోగాను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న జిల్లాలో 10 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

- వివరాలు 6లో..

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ

- పాయింట్లే కీలకంగా అడుగులు
- ముగిసిన తొలిదశ ప్రక్రియ
- జిల్లాలో 6,106 దరఖాస్తులు

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ నెలకొంది. ఉద్యోగోన్నతులు, బదిలీల్లో పాయింట్లే కీలకంగా మారడంతో ఎవరికి వారు పాయింట్ల కోసం అన్ని రకాల దరఖాస్తులను సమర్పిస్తుంచారు. వీరిలో కొందరికి నెగటివ్, మరికొందరికి పాజిటివ్ పాయింట్ల కేటాయింపులతో టీచర్లు తాము కోరుకున్న స్థానం దక్కుతుందో లేదో అన్న ఆందోళనలో ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం కాకుండా కొంత ఆలస్యం కావడం, అభ్యంతరాలు వస్తుండటంతో అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందోనంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతానికి దరఖాస్తులు ప్రక్రియ మొత్తం పూర్తయిందని, తదుపరి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని చెబుతున్నారు.

- వివరాలు 6లో..



ఎస్‌ఏల ఉద్యోగోన్నతుల్లో గందరగోళం

- కౌన్సెలింగ్ నేటికి వాయిదా

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : బుధవారం జరగాల్సిన స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియలో గందర గోళం నెలకొంది. షెడ్యూల్ ప్రకారం మంగళవారమే హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడం, బుధవారం కూడా చేపట్టడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతులు నిలిచి పోయాయి. కౌన్సెలింగ్ నిర్వహించే దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల వద్దనే రాత్రి వరకు ఎస్‌ఏలు ఎదురుచూపులు చూశారు. హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన తరువాత వారికి ఆర్జేడీ కార్యాలయం నుంచి స్థానాల కేటాయింపుల ఉత్తర్వులు వెలువడాలి. అయితే బుధవారం కూడా ఈ ప్రక్రియ జరగడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతలకు ఆటంకం ఏర్పడింది. హెచ్‌ఎంల ఉత్తర్వులు అనంతరం ఖాళీ అయ్యే స్థానాలను ప్రకటిస్తే ఎస్‌ఏలు ఆయా స్థానాలకు ఆప్షన్ ఎంచుకుంటారు. అయితే అధికారులు ముందస్తు ఆలోచన లేకపోవడం, అభ్యంతరాలు అధికమవడంతో షెడ్యూల్ ప్రకారం కాకుండా ప్రతిరోజూ ఆలస్యంగానే ఈప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఏస్‌ఏలకు సంబంధించి జడ్పీ యాజమాన్యంలో 89 మంది, ప్రభుత్వ యాజమాన్యంలో 8 మంది, మున్సిపాలిటీలో 4 కలిపి 101 ఉద్యోగోన్నతుల ప్రక్రియను బుధవారం రాత్రి నిలిపివేశారు. ఈ కౌన్సెలింగ్‌ను గురువారం నిర్వహిస్తామని అధికారులు అప్పటికప్పుడు ప్రకటించడంతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉంచి తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన చెందారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

విధుల్లో అలసత్వం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో జి.మోక్షిత అనే విద్యార్థినికి సోషల్ స్టడీస్ సబ్జెక్టులో 84 మార్కులు రావాల్సి ఉండగా 21 వేసినందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ మనుబోలు జడ్పీ స్కూల్ ఎస్‌ఏ ఎ.శాంతిని, స్పెషల్ అసిస్టెంట్ కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ యూపీ స్కూల్ ఎస్‌జీటీ వి.సురేష్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

తెలుగులోనే పాఠాలు చెప్పాలి

- తెలుగు ఉపాధ్యాయుల విన్నపం

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు తెలుగు భాషను బోధన మాధ్యమంగా అమలు చేయాలని తెలుగు ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో బాలాజీ రావుకు వినతిపత్రం అందజేశారు. తెలుగు భాష విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. మాతృభాష లేకుంటే తెలుగు విద్యార్థుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ప్రస్తుత బదిలీల్లో తెలుగు ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీంద్ర, సాగర్ మహేష్, పెంచలయ్య, హజరత్తయ్య, శ్రీనివాసులు, మండవ శ్రీనివాసులు, షేక్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

బాల యాచకులు కనిపిస్తే చర్యలు

నెల్లూరు (హరనాథపురం) :బాల యాచకులను బడిలో చేర్పించిన తర్వాత మరలా యాచక వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. తిక్కన భవన్‌లో సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. దత్తత స్వీకరణ పిల్లల విషయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీవో సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష పీడీ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో
సీఐడీ అధికారుల పరిశీలన



తిరుమలాపురంలో జామాయిల్ తోటలను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

ఉదయగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి) : తిరుమలాపురం గ్రామంలోని అగ్రిగోల్డ్ భూముల్లో అక్రమంగా జామాయిల్ నరికివేయడంపై బుధవారం సీఐడీ సీఐ రాజేష్‌కుమార్, ఎస్ఐ రాజు పరిశీలించారు. నరికిన జామాయిల్ కర్రను, కర్రలోడుతో ఉన్న మూడు లారీలను వారు పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో జామాయిల్ నరికిన ప్రాంతాన్ని సర్వే చేయించారు. 139, 140, 145 సర్వే నెంబర్లలో జామాయిల్ నరికినట్లు గుర్తించారు. ఇత్తడి శ్రీనివాసులు అనే వ్యక్తి జామాయిల్ కర్ర నరికేందుకు తమను పిలిచాడని, తమకు ఏ పాపం తెలియదని సీఐడీ అధికారుల ముందు కూలీలు వాపోయారు. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ పరిశీనలలో సీఐడీ పోలీసులు రాజశేఖర్, మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో తిరంగా ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి బుధవారం పాత బస్టాండ్ సెంటర్ వరకు బీజేపీ, జనసేన నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ మాట్లాడుతూ పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో కూకటి వేళ్లతోసహా పెకళించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ సంఘ సంచాలక్ కేతరాజు కేశవరావు, నాయకులు శ్రీధర్, కృష్ణయ్య, మోహన్ బాబు, కాసా శ్రీనివాసులు, సురేంద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9247
వెండి కిలో ధర	రూ. 100700
వెండి ఒక గ్రాము	రూ. 103.70



గ్రామాల్లో పారిశుధ్యం చర్యలు

● కొవి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో

తోటపల్లిగూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టామని ఎంపీడీవో కే. వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు.

? : గ్రామాల్లో పారిశుధ్యం ఎలా ఉంది.

! : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగుపరుస్తున్నాం. మురుగు కాలువలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నాం.

ఇంటర్వ్యూ

? : ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా పేడదిబ్బలు తొలగించారా.

! : గ్రామాల్లో రోడ్డు పక్కన పేడదిబ్బలను తొలగించాం. రోడ్డు పక్కన పేడదిబ్బలు వేసేవారికి నోటీసులు ఇచ్చాం. ఎవరైనా పంచాయతీ స్థలంలో దిబ్బలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

? : గ్రామాల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేశారా.

! : ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పోయకుండా గ్రామాల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేశాం.

? : ఉపాధి పనుల్లో అవినీతిపై ఏమంటారు.

! : ప్రతి గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఎక్కడ అవినీతి లేకుండా ప్రత్యేక దృష్టి పనులు పరిశీలిస్తున్నాం. కూలీలకు వేసవి తాకిడి ఎక్కువగా ఉండడంతో ఉదయం 6.30 నుంచి 10.30గంటల వరకు మాత్రమే పని చేయిస్తున్నాం.

కోవూరులో సమైక్యతా యాత్ర

కోవూరు, మే, 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకులు, కార్యకర్తలు బుధవారం కోవూరులో సమైక్యతా యాత్ర చేపట్టారు. బజారు కూడలి నుంచి మందబయలు కూడలి వరకు చేపట్టిన ఈ యాత్రలో కరపత్రాల్ని పంపిణీ చేశారు. అనంతరం మండల కమిటీ ప్రధాన కార్యదర్శి గుండవరపు శేషయ్య మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌తో యుద్ధం ప్రకటించి, అమెరికా అధ్యక్షుడు ట్రంపునకు భయపడి యుద్ధాన్ని విరమింపచేయడం దేశాన్ని కించపరచడమేనని చెప్పారు. అసమర్థ కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో గుంజి దయాకర్, శ్రీనివాసులు, హరి, అఫ్రోజ్, సర్దార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు సరుడు చోరీ

బుచ్చిరెడ్డి పాళెం,మే28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉక్కాల రాజేశ్వరమ్మ ఇంటి వీధిలో ఇమ్మిడిశెట్టి శాంతి అనే మహిళ మంగళవారం రాత్రి నడిచి వస్తుండగా, ఆమె మెడలోని ఏడు సవర్ల బంగారు సరుడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. పోలీసుల కథనం మేరకు, విజయవాడకి చెందిన శాంతి బుచ్చిలోని పద్మావతి కల్యాణమండపంలో జరిగిన సమీప బంధువుల చిన్నారి పుట్టినరోజు వేడుకలకు వచ్చారు. కార్యక్రమం పూర్తయ్యాక రాత్రి 10గంటలకు సోదరుడు చోళం వెంకయ్య బైక్‌పై తీసుకొచ్చి రిజిస్ట్రార్ ఆఫీసు సెంటర్ వీధి వద్ద దించి, టిఫిన్ తీసుకువస్తానని వెళ్లాడు. ఈ క్రమంలో ఆమె రోడ్డులో నుంచి డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ వీధిలోని ఇంటి ముందు ఆగి, గేటు తీస్తున్నది. దీంతో వెనుక నుంచి ఓ గుర్తుతెలియని యువకుడు ఆమెను గట్టిగా పట్టేసి మెడలో సరుడు లాగే ప్రయత్నం చేయగా రాలేదు. దీంతో ఆమె కిందపడడంతో మెడలోని సరుడుతోపాటు దానికున్న, కాసులు, గుండ్లు లాక్కొని పరుగులు తీసి, రోడ్డుపైన ఉన్న మరో వ్యక్తితో బైక్‌పై ఉడాయించాడు. సరుడులాక్కెళ్లిన వ్యక్తి ఎర్ర చొక్కా వేసుకుని ఉన్నట్టు ఆమె గుర్తించారు. అప్పటికే స్థానిక యువకులు వెంబడించగా, వారు ముంబై హైవే మీదుగా పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులురెడ్డి ఓ చోట సీసీ కెమెరాలు పరిశీలింగా, ఎర్రచొక్కా వేసుకున్న యువకుడు చెన్నూరురోడ్డులోని రేబాల కాలువ సమీపంలో ఉన్న బ్రాందీ షాపు వద్ద నుంచి ఆమెను వెంబడించి సరుడు చోరీ చేసినట్టు గుర్తించారు. దొంగను పట్టుకుని సొత్తు రికవరీ చేయాలని ఆమె కోరారు. కాగా దొంగతో జరిగిన పెనుగులాటలో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్



కోవూరు : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, స్థానిక నాయకులు



పొదలకూరు : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు



రాపూరు : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పొదలకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అని త్రికరణశుద్ధిగా నమ్మిన ఎన్టీఆర్, టీడీపీ స్థాపనతో దేశంలోనే మొదటిసారిగా సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని మండల టీడీపీ నేతలు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్, పులిపాటి వెంకటరత్నంనాయుడు కొనియాడారు. బుధవారం పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని భారీ కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం మనమంతా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదాల సుగుణమ్మ, పొట్టి సుధాకర్, మురళీ, వెన్నపూస రాజశేఖర్, సందీప్, గిరి, కొంగి మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కోవూరు : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ జయంతిని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దారు నిర్మలానందబాబు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు పంతంగి రామారావు, కలికి సత్యనారాయణ రెడ్డి, ఇంటూరి విజయకుమార్, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి, కుక్కంటి గోపాల్ తదితరులు పూలమాలు వేసి, ఎన్టీఆర్ సేవల్ని కొనియాడారు.

● రాపూరు : దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు జయంతి వేడుకలు రాపూరు రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ రవితేజ, డిటి అశోక్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధ వారం మాజీ సీఎం ఎన్టీఆర్ 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం గొప్ప సినీనటుడిగా మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా, ప్రజల హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రొఫెసర్లు అందె ప్రసాద్, డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ ఎన్‌వో గోపాల్, డాక్టర్ హనుమారెడ్డి, డాక్టర్ చెంచురెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సీఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ జీ సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



విడవలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వాడవాడలా ఘన నివాళులు

● తోటపల్లిగూడూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఎంపీడీవో వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు : ఎన్టీఆర్ జయంతిని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి కార్యదర్శి గరుడయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే 19 పంచాయతీల్లో ఆయా కార్యదర్శులు నివాళులు అర్పించారు.

● బుచ్చిరెడ్డిపాళెం : మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు కొనియాడారు. బుధ వారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుచ్చిలోని లోటస్ గ్రాండ్ వద్ద కేక్ కట్ చేసి, ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బత్తల హరికృష్ణ, ఎంవీ. శేషయ్య, టంగుటూరు మల్లారెడ్డి, గుత్తా శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, బెళుం మల్లారెడ్డి, పర్వీన్, యూ. దశరథ, కిషోర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

● విడవలూరు : ఎన్టీఆర్ జయంతి వేడుకలు మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్లపల్లిలో టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, ఉచ్చూరు సుధీర్‌రెడ్డి, తాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి విగ్రహానికి పూల మాలలు వేసి, పేదలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపాల జనార్దన్‌రెడ్డి, వేగూరు చంద్రారెడ్డి, పూండ్ల ఏసోబు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు



మనుబోలు పంచాయతీ కార్యాలయంలో ఎన్టీఆర్‌కి నివాళులు అర్పిస్తున్న పంచాయతీ ఉద్యోగులు



టీపీ గూడూరు : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో తదితరులు

విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగు

కోవూరు, మే, 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం సాగించిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో బుధవారం ఆమె 'గత పాలన విధ్వంసం నుంచి వికాసం వైపునకు పరుగులు' అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చంద్రబాబు క్రేజ్, ఇమేజ్, విజన్‌తో తాము వ్యాపారరంగంలో నడుస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయి నాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ తమలాంటి కొత్తవారికి రాజకీయాల్లో అవకాశం కల్పించడం సంతోషకరమని ఆమె తెలిపారు. ఉత్తమ నాయకత్వ లక్షణాలున్న చంద్రబాబు, లోకేష్‌లతో కలిసి పనిచేయడం తనకూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు 25కు పైగా పాలసీలు ప్రవేశపెట్టారని చెప్పారు.



మహానాడులో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

మహానాడులో వెంకటాచలం,రాపూరు టీడీపీ నేతలు





మహానాడులో పాల్గొన్న వెంకటాచలం,రాపూరు మండల టీడీపీ నేతలు

వెంకటాచలం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు మండల టీడీపీ నేతలు హాజరయ్యారు. బుధవారం ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఎంతో ఉత్సాహంగా మహానాడులో పాల్గొన్నారు. దీంతో మహానాడు ప్రాంగణంలో సందడి నెలకొంది. రెండో రోజు కార్యక్రమాల్లో టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, కుంకాల నాగేంద్రప్రసాద్, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, ఉప్పలపాటి ధనుంజయనాయుడు, కందిమళ్ల సతీష్‌నాయుడు, శ్రీనితరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరిరోజైన గురువారం కడపకు బయలుదేరి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్దసంఖ్యలో ప్రైవేటు బస్సులు, కారులు, వ్యాన్లు సిద్ధ చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు చెముడుగుంట నుంచి మండలానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు వేలాదిగా తరలివెళ్లనున్నారు.

● మహానాడులో రాపూరు నేతలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న మహానాడు సభకు రాపూరు మండలం నుంచి నాయకులు, క్రియాశీల కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. రాపూరు మండల యువ నాయకుడు చెన్ను అశోక్‌రెడ్డి ఆధ్వర్యాన పార్టీ నాయకులు కొండ్లపూడి రాఘవరెడ్డి, గడ్డం సంజీవరెడ్డి, బత్తిన శ్రీనివాసులురెడ్డి, కూకటి పెంచలయ్య, కార్యకర్తలు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను విజయవంతం చేయాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం డీన్ సీడీసీ ఆధ్వర్యంలో జరిగిన ప్రిన్సిపాళ్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సమావేశాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా అనేక మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, ఈ పరిస్థితుల్లో యోగా అందుకు శాశ్వత పరిష్కార మార్గమన్నారు. వచ్చే నెల 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. యోగాంధ్ర వెబ్‌సైట్‌లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డీన్ సీడీసీ డాక్టర్ ఎం ఉస్సేనయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలంలో యోగాంధ్ర

వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం యోగాంధ్రలో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కల్పనతోసహా సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈసందర్భంగా యోగా నిపుణుడు యోగా ఆసనాలను ప్రదర్శించారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన అవసరం

వెంకటాచలం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలపై అవగాహన అవసరమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే.వాణి తెలిపారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె ఖైదీల యోగాక్షేమాలు, వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ హర్షవర్ధన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కండలేరు అతిథిగృహంలో అగ్నిప్రమాదం

రాపూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు జలాశయం అతిథిగృహంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి దస్త్రాలు, సీసీ టీవీలు దగ్ధమయ్యాయి. కండలేరు అతిథిగృహం జెఈ అనిల్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కండలేరు అతిథిగృహంలోని స్టోర్‌రూమ్‌లో బుధవారం మధ్యాహ్నం సమయంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశామన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారన్నారు. అగ్నిప్రమాదంలో దగ్ధమైన పరికరాల విలువ సుమారు రూ. 5 లక్షల వరకు ఉంటుందని జెఈ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మనుబోలు, మే 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతూ గాయపడిన కొండేటి చిన్నయ్య (60) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మనుబోలులోని కోదండరామపురం దళితవాడకు చెందిన చిన్నయ్య కూలీ పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు జాతీయరహదారి దాటుతుండగా మోటార్‌సైకిల్ ఢీకొనడంతో గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స కోసం గూడూరుకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. చిన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళితకాలనీ వాసులు కోరుతున్నారు.

నామినీకి పాలసీ బాండు అందజేత

పొదలకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పాలసీ బాండును నామినీకి ఎస్‌బీఐ సర్వీస్ మేనేజర్ జీ.రవితేజ బుధవారం అందించారు. మండలంలోని ఇనుకుర్తి గ్రామానికి చెందిన జడపల్లి వెంకటేశ్వర్లు గత ఏడాది మేలో బీమా ప్రీమియం చెల్లించారు. ఆయన ఈ ఏడాది ఫిబ్రవరి 20న మరణించారు. దీంతో నామినీగా ఉన్న భార్య జడపల్లి లక్ష్మీనరసమ్మకు రూ.2లక్షల పాలసీ బాండును బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ ఎం.సునీల్‌కుమార్, సర్వీసు మేనేజర్ జీ.రవితేజలు అందించారు. త్వరలోనే నగదును అందచేస్తామని పేర్కొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

కోవూరు, మే28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మైథిలీ సినిమాహాలును ఆర్డీవో అనూష బుధవారం తనిఖీ చేశారు. హాలులో పరిశుభ్రతను పరిశీలించి పలు సూచనలిచ్చారు. టిక్కెట్ల ధరలపై యాజమన్యం నుంచి వివరాలు రాబట్టారు. కొత్త సినిమాలు విడుదలైన సమయంలో అధిక ధరలకు టిక్కెట్లను విక్రయిస్తుంటే వివరాలు చెప్పాలని కోరారు. ఆమె వెంట తహసీల్దారు నిర్మలానందబాబ ఉన్నారు. అనంతరం వేగూరులలో కొనసాగుతున్న భూముల రీసర్వేను పరిశీలించారు. సర్వేయర్లకు సూచనలిచ్చారు.

● బుచ్చిరెడ్డిపాళెం : సినిమా థియేటర్లలో అన్నీ వసతులను తనిఖీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో పట్టణంలోని థియేటర్లను తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. టిక్కెట్ల ధరలు, వాహనాలకు వసూలు చేసే రుసుం వివరాలు తెలుసుకున్నారు. థియేటర్లలో 3 తరగతుల ఏర్పాటుతో టిక్కెట్లు ఉండాలని, బైక్‌లకు రూ.10 కంటే ఎక్కువ వసూలు చేయకూడదని యాజమాన్యాలను ఆదేశించారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాల ధరలపట్టికను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

C.R.I.M.E N.E.W.S

అల్లూరులో మూడు చోట్ల చోరీ

● రూ.80 వేలు, 4 సవర్ల బంగారం అపహరణ



దుండగులు చెల్లాచెదురుగా పడేసిన బీరువాలోని దుస్తులు

అల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో మూడు చోట్ల చోరీ జరిగిన ఘటనలు బుధవారం వెలుగు చేశాయి. దీంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వివరాల మేరకు.. అల్లూరు గొల్లపాలెంవీధిలో నివాసం ఉంటున్న బేల్దారి మేస్త్రీ షేక్ రఫీ కుటుంబసభ్యులతో కలసి నాగూరులో మొక్కులు తీర్చుకునేందుకు గత ఆదివారం వెళ్లారు. బుధవారం తిరిగిరాగా ఇంట్లోని దుస్తులు, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండాన్ని గమనించి ఇంట్లో పరిశీలించగా కూలీలకు ఇవ్వాల్సిన రూ.80 వేల, 4 సవర్ల బంగారు వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే అల్లూరుపేట శివాలయం సమీపంలోని సాయిబాబా ఆలయంలో చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయం వెనుక వైపు నుంచి వచ్చి నిఘా కెమెరాల వైర్లను కట్ చేసిన అనంతరం ఆలయ తలపులు పగలగొట్టాడు. అయితే ఆలయంలోని వస్తువులు దొంగిలించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని బలిజపాలెం వీధిలో నివాసం ఉంటున్న పప్పు పెంచలయ్య కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లడంతో దుండగులు తలుపుల తాళాలు పగులగొట్టి, ఇంట్లో వస్తువులు ధ్వంసం చేశారు. తలుపులు తెరిచి ఉండాన్ని గమనించిన స్థానికులు పెంచలయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన బుధవారం రాత్రికి బయలుదేరి అల్లూరుకు రానున్నాడు. ఆయన వస్తేగానీ దొంగలు ఏమి అపహరించారో తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కిషోర్‌బాబు దర్యాప్తు చేపట్టారు.

సోమశిల దక్షిణ కాలువలో చిరుత కళేబరం



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కలువాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాత్మకూరు సమీపంలోని సోమశిల దక్షిణ కాలువలో ఓ చిరుత కళేబరాన్ని బుధవారం స్థానికులు గుర్తించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని కాలువలోనుంచి కళేబరాన్ని బయటకు తీసి పరిశీలించారు. చిరుత కళేబరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో నీటి కోసం కాలువలోకి దిగి తిరిగి రాలేక నీటిలో పడి మృతి చెంది ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. పంచనామా అనంతరం పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహిస్తామని కలువాయి డీఆర్వో ఖాజారసూల్, బీట్ ఆఫీసరు రాహుల్ తెలిపారు. చిరుతకు ఏడాది వయసు ఉంటుందని అంచనా వేశారు. కాగా, దక్షిణ కాలువకు ఇటీవలే కలువాయి చెరువు నుంచి 120 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు.

చేపల వేట నిషేధ సమయంలో ఎలా వస్తారు?



చెన్నై మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ

బిట్రగుంట, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సముద్రంలో చేపల వేట నిషేధం ప్రకటించి ఉన్న సమయంలో తమిళనాడు మత్స్యకారులు చేపల వేటకు ఎలా వస్తారని స్థానిక మత్స్యకార నాయకుడు త్యాగరాజు ప్రశ్నించారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో చెన్నై, కాసిమీడు ప్రాంతాలకు చెందిన 6 గిల్‌నెట్ బోట్లు బుధవారం నిలుపుకుని ఉండటం స్థానికులు గమనించారు. ఏపీలో చేపలవేట నిషేధం ఉందని, ఈ సమయంలో ఎలా వస్తారని ప్రశ్నించడంతో వారు ఎదురు తిరిగారు. దీంతో ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసుల దృష్టికి తీసుకుపోయారు. సమాచారం తెలుసుకున్న ఇస్కపల్లి మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సముద్రం అలజడిగా ఉండటం కారణంగా హార్బర్‌కు చేరామని, ఇటువంటి పరిస్థితులో తిరిగి వెళ్లలేమని చెన్నై మత్స్యకారులు తేల్చి చెప్పారు. అయితే ఎలాంటి గొడవలు జరగకుండా ఇరువురికి సర్ది చెప్పారు. ఈ విషయాన్ని మెరైన్ ఎస్ఐ ఉన్నతాధికారులకు తెలియచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కనీసం కూర కోసం కూడా చేపల వేట చేయకుండా ఉన్నామని, తమిళనాడు వాళ్లు మత్స్యసంపద దోచుకుపోవడం ఎంత వరకు సబబు అని స్థానిక మత్స్యకారులు మండిపడుతున్నారు.

రైల్లో 7.7 కేజీల గంజాయి స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ సుధాకర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో భాగంగా రైల్వే పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ తన కార్యాలయంలో తనిఖీల వివరాలను మీడియాకు వెల్లడించారు. కావలి, నెల్లూరు, గూడూరు రైల్వే పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆయా స్టేషన్లలో ఒడిశా వైపు నుంచి వస్తున్న రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ హరిచందన కలిసి టాటానగర్-ఎర్నాకులం రైల్లోని జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా మదుకూరు ప్రాంతానికి చెందిన ఎస్ మహమద్ సమీర్, గుణశేఖర్ దీపక్, కర్ణాటక రాష్ట్రం చిక్‌మంగ్‌లూరు జిల్లా చిక్కాంగల ప్రాంతానికి చెందిన ఎస్ హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 7.7 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా ఒడిశా - ఏపీ సరిహద్దు జిల్లాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రం జోలార్‌పేట పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు చెన్నకేశవ, హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠను రైల్వే డీఎస్పీ జీ. మురళీధర్ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 525	

'అడంగళ్‌లో పేర్లు మార్పు.. న్యాయం చేయండి'

నెల్లూరు (సాంస్కృతికం), మే 28 (ఆంధ్రజ్యోతి) : తమ భూమికి సంబంధించి అడంగళ్‌లో పేర్లను తొలగించి, ఆక్రమించే ప్రయత్నం చేస్తు న్నారని, న్యాయం చేయాలని చేజర్ల మండలం కాలువాయి గ్రామస్థులు హరీష్, గిరిబాబు అధికారులను కోరారు. నగరంలోని జర్నలిస్టు భవన్‌లో బుధవారం హరీష్ విలేకరులతో మాట్లాడారు. తమ తాత నరసయ్య గతంలో 3.30 సెంట్ల భూమిని కొన్నారని తెలిపారు. ఆ భూమికి తమ కుటుంబీకులు ఆర్ నరసయ్య, ఆర్ గిరిబాబు పేరున అడంగళ్ ఉన్నాయని చెప్పారు. అయితే ఇటీవల అడంగళ్‌ను పరిశీలించగా గ్రామంలోని పలువురు పేర్లు నమోదై ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.



వికసించిన 'మే' పుష్పాలు

ప్రతీ సంవత్సరం మే నెలలోనే వికసించే పుష్పాలు అందరిని అలరిస్తున్నాయి. నెల్లూరు రూరల్ గొల్లకందుకూరు గ్రామంలోని పొణక హరిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఆ పుష్పాలు విరబూశాయి. ఏటా మే నెల మొదటి వారంలో వికసించే పుష్పాలు ఈ సారి నెలాఖరులో వచ్చినట్లు యజమాని తెలిపారు. ఈ పువ్వు లను గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి)

అన్న... ఆత్మగౌరవ ప్రతీక

- ఘనంగా ఎన్టీఆర్ జయంతి
- టీడీపీ, ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు



టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం) మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, ఆత్మగౌరవ ప్రతీక దివంగత ముఖ్యమంత్రి అన్న ఎన్టీ రామారావు అని తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. ఎన్టీఆర్ జయంతిని బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం పెంచల నాయుడు మాట్లాడుతూ పాలనలో ఎన్టీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి, పేదలకు ఎన లేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నన్నే సాహెబ్, సాబీర్‌ఖాన్, పొత్తూరు శైలజ, కనపర్తి గంగాధర్, మాతంగి కృష్ణ, ఖాదర్‌బాషా, బీవీలక్ష్మి, శ్రీదేవి తదిత రులు పాల్గొన్నారు.

గొప్ప నాయకుడు ఎన్టీఆర్ : నుడా చైర్మన్

నెల్లూరు (జడ్పీ), మే 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుక నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, అధికారు లు నివాళులర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అని చెప్పారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహానీయుడు ఎన్టీఆర్ అన్నారు. రాజకీయ, సినీ రంగాల్లో ఘనత చాటిన ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని కోరారు. అధికారుల సహకారంతో నుడాను నెంబర్ వన్‌స్థానంలో నిలుపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా సెక్రటరీ పెంచల్‌రెడ్డి, ఏవో ఈశ్వర్‌రాజు, పీవో హిమబిందు, డీఈ మనోహర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సురేష్, ఈవోపీఆర్డీ సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో వేడుకలు

నెల్లూరు (జడ్పీ), మే 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుక నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్‌ఈ విజయన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ మహోన్నత మైన వ్యక్తి అని, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉం టారన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నుడా కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, అధికారులు, సిబ్బంది

లోకేష్‌కు కార్యనిర్వహాక పాత్ర ఇవ్వండి

- మహానాడులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, మే 27,(ఆంధ్రజ్యోతి) : పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపుతూ, నాయకత్వాన్ని పటిష్టం చేసిన నారా లోకేష్‌కు టీడీపీలో కార్య నిర్వాహక పాత్ర కల్పించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. కడపలో జరుగుతున్న పార్టీ మహానాడులో బుధవారం శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. నేడు టీడీపీ అధికారంలోకి రావడానికి ఎందరో కార్యకర్తలు ప్రాణాలర్పించారని, అలాంటి కార్యకర్తల కుటుంబాలకు లోకేష్ అండగా నిలవడానికి పార్టీలో కార్య నిర్వహక పాత్రపోషించాల్సి సమయం ఆసన్న మైందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా సీఎం చంద్రబాబు అనుభవంతో ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. కార్యకర్తే అధినేత అన్న నినాదం కేవలం టీడీపీలోనే వినిపిస్తుందని తెలిపారు.

ఎన్టీఆర్ పట్టుదల స్ఫూర్తిదాయకం

- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు క్రమశిక్షణ, పట్టుదల భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ జీ కృష్ణకాంత్ కొనియాడారు. రామారావు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు ప్రజలకు, రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

క్షయ వ్యాధిపై విస్తృత ప్రచారం

- 'టీబీ ముక్త్ భారత్'లో కలెక్టర్ ఆనంద్



ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం), మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గుర్తించిన వారందరికీ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, అలాగే ఆ వ్యాధిపై ప్రజలు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయనే మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు, మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు వాడేవారికి తప్పని సరిగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. 60 ఏళ్ల పైబడిన వారందరితో పాటు బాడీమాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారు, గత ఐదేళ్లలో క్షయ వచ్చిన వారు, క్షయ వచ్చిన కుటుంబాల్లోని వారికి కూడా పరీక్షలు చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, మలేరియా అధికారి హుస్సేనమ్మ, కావలి డీడీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో ఆర్థిక భారం తగ్గించుకోండి

నెల్లూరు(సిటీ), మే 27(ఆంధ్ర జ్యోతి) : సోలార్ విద్యుత్ వాడ కం వల్ల ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని కార్పొరేషన్ కమిషనర్ నంద న్ నగర పాలక సంస్థ ఉద్యోగులకు సూచించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తు న్నాయని, సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం పొందాలన్నారు. అనంతరం యోగాంధ్ర శిక్షకులతో సమావేశం నిర్వహించారు.

జనసేన సభ్యత్వ పత్రాల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్ర జ్యోతి) : జనసేన పార్టీ సభ్యత్వం పొందిన నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదు పత్రాలను పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ బుధవారం జిల్లా కార్యా లయంలో అందించారు. టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్ సారథ్యంలో పార్టీ సభ్య త్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో నాయకులు గునుకుల కిషోర్, జమీర్, పావుజెన్ని చంద్రశేఖర్, మార్కెట్ సురేష్ పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), మే 28 (ఆంధ్ర జ్యోతి) : ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రంగనాయకులపేటలో ఉన్న అసోసియేషన్ కల్యాణ మండపంలో వృద్ధాప్య పింఛన్ల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా సంతపేట సీఐ దశరథరామారావు హాజరయ్యారు. ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ చేస్తున్న సామాజిక సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి ఏవీ ఫణీంద్ర కుమార్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ముఖం రఘునాథం పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సీఐ దశరథ రామారావు



కేవీఆర్ పెట్రోలు బంకు వద్ద కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

కంటైనర్-బస్సుకు మధ్య

నలిగిన ప్రాణం

- ఆగిఉన్న ఆటోను ఢీకొన్న బస్సు
- భార్య చూస్తుండగానే మృత్యువడిలోకి భర్త
- కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద ఘోర ప్రమాదం



కంటైనర్ కిందకు దూసుకెళ్లిన ఆటో

నెల్లూరు (క్రైం), మే 28 (ఆంధ్రజ్యోతి) : సినిమాలో చూసే యాక్షన్ సీన్‌లు కళ్ల ముందు జరిగితే ఎలా ఉంటుందో నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం తెలియజేసింది. పనులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళుతున్న దంపతులను మృత్యువు బస్సు రూపంలో వెంటాడింది. భార్య చూస్తుండగానే భర్త మృత్యువడిలోకి దూసుకెళ్లడం, చావును చూస్తూ చేసేది లేక భర్త మృత్యువడిలోకి జారుకోవడం వంటి విషాద ఘటన చోటుచేసుకుంది. నగరంలోని కోర్టు ఎదురుగా మదీనా బిర్యానీ దుకాణాన్ని హబీబ్(45), ఆలియా దంపతులు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి దుకాణం మూసి ఆటోలో సామగ్రి వేసుకొని ప్రగతినగర్ మూడవీధిలోని తమ ఇంటికి బయలుదేరారు. కేవీఆర్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి రిలయన్స్ వైపు నుంచి నాగాల్యాండ్‌కు చెందిన ఓ భారీ కంటైనర్ వస్తోంది. దీనిని చూసిన హబీబ్ ఆటోను ఆపాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో కంటైనర్ లోకి దూసుకుపోయింది. ఆటోలో ఉన్న ఆలియా దూకేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. అయితే ఆటోను నడుపుతున్న హబీబ్ కంటైనర్ కిందకు ఆటోతోపాటు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నగర డీఎస్పీ సింధుప్రియ, దర్గామిట్ట సీఐ రోశయ్య, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కంటైనర్ కింద ఇరుక్కు పోయిన ఆటోను తీయించి, హబీబ్‌ను బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంతా గందరగోళం

(3వ పేజీ తరువాయి)

హెల్త్ అసిస్టెంట్లకు సర్దుబాటు బదిలీల్లో మినహాయింపు ఇవ్వడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

- వారికి బదిలీలు లేవట!

మరోవైపు జిల్లా కార్యాలయంలోని ఫైలేరియా విభాగంలో 8 మంది, మలేరియా విభాగంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే వీరిని బదిలీల కౌన్సెలింగ్ జాబితాలో మాత్రం చేర్చలేదు. నెల్లూరుకు కూత వేటు దూరంలో ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ల పేర్లను తొలి జాబితాలో చేర్చి ఆ తర్వాత తొలగించారు. దీని వెనుక మర్మమేమిటో అధికారులే చెప్పాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. తాజాగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలోనూ హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పోటీ ఎక్కువైంది. నగరంలోనే 20 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, కావలిలో 4, కోవూరు. ఆత్మకూరులలో ఒక్కొక్కటి చొప్పున ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ హెల్త్ అసిస్టెంట్లను కొత్తగా నియమిస్తున్నారు. మరోవైపు ఆత్మకూరు, మహమ్మదాపురం, కలువాయి, పొదలకూరు, చిరమన, చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ అసిస్టెంట్ల అవసరం ఉన్నా ఆ దిశగా అధికారులు జాబితా తయారు చేయక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే!

వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ సర్దుబాటు బదిలీలు జరుగుతున్నాయి. ఈ నెల 27న కౌన్సెలింగ్ జరగాల్సి ఉన్నా ఉద్యోగుల అభ్యర్థన మేరకు 30కి వాయిదా వేశాము. మలేరియా విభాగం ఆదేశాలతోనే హెల్త్ అసిస్టెంట్ల జాబితా తయారు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కౌన్సిలింగ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తున్నాము.

- సుజాత, డీఎంహెచ్‌వో

సినిమా హాళ్లపై రెవెన్యూ దాడులు



కావలిలోని థియేటర్లలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), మే 28 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లపై చర్చ సాగుతున్న సమయంలో జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు ప్రారంభించారు. థియేటర్లలో టికెట్లు, తినుబండారాలు, కూల్ డ్రింక్స్ ధరలు, పారిశుద్ధ్యం, అగ్నిమాపక శాఖ అనుమతులు, సౌకర్యాలు ఇలా అనేక అంశాలపై తనిఖీలకు తెర లేపారు. నెల్లూరు, కందుకూరు, కావలి ఆర్డీవోలు నాగ సంతోష్ అనూష, శ్రీపూజ, సన్నీ వంశీకృష్ణ ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. నగరంలో ఎమ్మార్వో షఫీమాలిక్ తనిఖీలు చేశారు. ఈ రిపోర్టును ప్రభుత్వానికి అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కాకాణితో వైసీపీ నాయకుల ములాఖత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్రజ్యోతి) : రుస్తుం మైన్స్ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో బుధవారం వైసీపీ నాయకులు కలిశారు. ములాఖత్‌లో భాగంగా ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కాకాణితో మాట్లాడారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం వారు కారాగారం బయట మీడియాతో మాట్లాడారు. కాకాణిపై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఆయన ధైర్యంగా ఉన్నారని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారని చెప్పారు. కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో అరాచకపాలన

- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

నెల్లూరు(వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని మరిచి అరాచక పాలన సాగిస్తూ, అక్రమ అరెస్టలకు పాల్పడుతోందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని గాలికి వదిలేసి వైసీపీ ముఖ్య నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారన్నారు. కాకాణి అక్రమ అరెస్టను ఖండిస్తున్నామన్నారు. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామని చెప్పారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్నామని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం ప్రభావతి అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాకారుల పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యాని కి వ్యాయామం, నడక, క్రీడలే మార్గమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఎంవీ సుబ్బారెడ్డి, రామచంద్రశెట్టి, పీ శ్రీనివాసులు రెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, వివేకానంద వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

- ఫ్రెండ్స్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్టేడియంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుధవారం కొనసాగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం ప్రభావతి, అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.
- ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రభావతి పాల్గొని వాకర్స్‌కు దిశానిర్దేశం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ ఆమెకు వెంకటగిరి జరీ చీరను, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రసాదం అందించారు. అసోసియేషన్ కార్యదర్శి స్నేహ సురేష్, ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు పౌష్టికాహారం అందిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి, తదితరులు

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు సంతపేట పోలీసులు కే సు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నాల్గో మైలు టిడ్కో కాలనీలో సుబ్రహ్మణ్యం, అనురాధ దంపతులు నివసిస్తున్నారు. వీరి మనవడికి తీవ్ర కడుపునొప్పి రావడంతో ఇటీవల రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ నెల 25న ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన సుబ్రహ్మణ్యం ఆ తర్వాత కనిపించ లేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపో వడంతో అనురాధ బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు, ఎల్లుండి క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యో తి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శుక్రవారం సీనియర్స్ వన్‌డే క్రికె ట్ జట్టు, 31వతేదీన అండర్-19 వన్‌డే జట్టును ఎంపిక చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రికె ట్ క్రీడా ప్రాంగణంలో జరిగే ఈ ఎంపిక లకు అర్హత కలిగిన క్రీడాకారులు హాజ రు కావాలన్నారు. ఆధార్ కార్డు, డ్రెస్‌కో డ్, సొంత కిట్‌తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

CHANGE OF NAME

I, OZILI ANJAMMA (School Secondary Certificate) Alias CHILLAKURU ANJANA (Aadhaar Card) Alias CHILLAKURU ANJAMMA (Passport) W/o. CHILLAKURU SREEDHAR REDDY, Residing at D.No.16-8-330, Ramalingapuram, Mamatha Nursing home, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that my Correct name as **CHILLAKURU ANJANA** (Correct), I further declare that Three names are one and the same Person.



శ్రద్ధాంజలి

శ్రీ కామినేని శ్రీనివాసులు నాయుడు గారు

జననం: 17-12-1961 మరణం: 13-05-2025

మా ప్రతి విజయంలోను మా వెనకుండి ముందుకు నడిపిన మహోన్నత వ్యక్తి, మంచికి, నిజాయితీకి నిదర్శనం, మా శ్రేయోభిలాషి

శ్రీ కామినేని శ్రీనివాసులు నాయుడు గారు (శ్రీనన్న)

వారి అకాల మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతితో, శోకతప్త హృదయాలతో...

మీ తమ్ముడు

వింజం భాస్కర్ నాయుడు (బాచి) నెల్లూరు

పెద్దకర్మ: తేది:29-05-2025 గురువారం ఉదయం 10 గంటలకు నెల్లూరు దర్గామిట్ట (LIC ఆఫీసు ఎదురుగా) C.C.S.నగర్‌లోని శ్రీనివాస నిలయం వారి స్వగృహం నందు జరుగును.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం

మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి...


నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

యోగాతో ఆరోగ్యం

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ
- 'యోగాంధ్ర'కు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన సాధకులు

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని నెక్లెస్ రోడ్డుపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిం చారు. దీనికి విశేష స్పందన లభించింది. కలెక్టర్, జేసీ, ఎస్పీ మొదలు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ యోగా కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో విస్తరించేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరికి యోగాను దినచర్యలో భాగం చేయాలన్నారు. జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు. అదే రోజున జిల్లాలో జరిగే కార్యక్రమంలో పది లక్షల మంది యోగాసనాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శిక్షణ పొందిన 300 మంది మాస్టర్ ట్రైనర్స్ అన్నీ గ్రామ, వార్డు స్థాయిల్లో 7వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ప్రజలతో యోగాసనాలు వేయిస్తారని తెలిపారు. అనంతరం యోగా గురువులను సత్కరించారు. యోగా ప్రాముఖ్యతను తెలిపే పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, ఆయుష్ ఆర్డీడీ డాక్టర్ పద్మావతి, నగర కమిషనర్ నందన్, ఏఎస్పీ సౌజన్య, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, జిల్లా యోగా సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్, కార్యదర్శి పెంచలయ్య, యోగా శిక్షకులు పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజలు

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ

- ముగిసిన తొలిదశ ప్రక్రియ
- జిల్లాలో 6,106 దరఖాస్తులు

నెల్లూరు (విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయిం ట్లు ఎంతో కీలకంగా మారుతున్నాయి. కోరుకున్న స్థానాలు దక్కించుకోవాలంటే అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. కొంతమంది పాయింట్లు పొందేందుకు తమకు వర్తించని అంశాలను దరఖాస్తులో పొందుపరిచి లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని కొన్ని సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రధానంగా స్టేషన్ పాయింట్ల కేటాయింపుల్లో నోటిఫికేషన్‌లో ఇచ్చిన విధంగా ఈ ఏడాది బదిలీలకు విద్యా సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నా రు. హెచ్‌ఎంలకు ఐదేళ్లు, ఇతర టీచర్లకు ఎనిమిదేళ్లు గరిష్ఠంగా పూర్తయితే వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఇక విద్యాసంవత్సరంలో 9 నెలలు పనిచేస్తే దానిని పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తున్నారు. ఏడేళ్ల పది నెలలు పూర్తయినా ఎనిమి దేళ్లుగా పరిగణించి తప్పనిసరి బదిలీల జాబితాల్లో చేర్చుతారు. దీని కనుగుణంగా పలువురు దరఖాస్తు చేసుకోగా వీరికి 8 సంవత్సరాలకు బదిలీ పాయింట్లు కేటాయించకుండా ఏడేళ్ల 10 నెలలు మాత్రమే లెక్కించి పాయింట్లు కేటాయిస్తుండడంతో ఆయా టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు తొమ్మిదేళ్లు పనిచేసిన వారికి కూడా ఒక ఏడాది తగ్గించి ఎనిమిదేళ్లకే పాయింట్ల కేటాయించడాన్నీ వ్యతిరేకిస్తున్నారు.

పాయింట్లే కీలకం

బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా స్పౌజ్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి. ఈ పాయింట్ల కోసం ఎలాంటి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకపోవడంతో దరఖాస్తు సమయంలో స్పౌజ్ పొందారని చెపుతున్నారు. భార్యాభర్తలు ఉద్యోగులలైనే ఈ ఎనిమిదేళ్లలో బదిలీల్లో ఒకరికి స్పౌజ్‌ను వినియోగించాలి. కానీ కొంతమంది గత బదీలీల్లో ఒకరు, ఈ బదిలీల్లో మరొకరు వినియోగించుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్, స్థానిక సంస్థలు ప్రభుత్వ సొసైటీల్లో పనిచేసే వారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు కేటాయిస్తారు. దీనికి భిన్నంగా కొంతమంది అర్హత లేకపోయినా పాయింట్లు పొందేలా పావులు కదుపుతున్నారని ఆరోపిస్తున్నారు. వీటన్నిటిపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వచ్చిన దరఖాస్తులు ఇవీ..

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మొత్తం 6,106 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ఈ బదిలీల ప్రక్రియను జూన్ 11 నాటికి పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 139, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో హిందీ 12, సాంస్కృతికం 1, తెలుగు 73, ఉర్దూ 2 కలిపి 88 దరఖాస్తులు వచ్చాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ 26, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 82, స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వే జెస్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 కలిపి 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యు కేషన్ (పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకే షన్ 12 కలిపి 1748 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,927 మంది మొత్తం 6,106 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రత్యేక బృందాలు వీటిని పరిశీలించి తుది జాబితాలను విడుదల చేయనున్నాయి.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

సరస్వతి ట్రావెల్స్

నెలలో 2 సార్లు అరుణాచలం యాత్ర, కాశి, శిర్డి, తమిళనాడు, రామేశ్వరం 2 రోజులు యాత్ర కలవు. 2+2, A/C, NoN A/C ఫంక్షన్‌లకు బస్సులు కలవు. సం.ప్ర. సెల్: 80085 11207, 73828 11207
AJR-212014

WANTED

★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమీషన్ : 5k. ఫోన్: 8977517749 AJH-6753

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ఆంజనేయస్వామి రాతి విగ్రహం వెలికితీత

వలేటివారిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం శివారు ప్రాం తంలో శిథిలమైన పురా తన జనార్దనస్వామి ఆల యం ప్రాంగణంలో కోటకట్టలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసి సుమారు 10 అడుగులు ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని వెలికి తీసిన ఘటన ఆలస్యంగా బుధ వారం వెలుగు చూసింది. వెలికితీసిన విగ్రహా న్ని పక్కనే ఉన్న వేప చెట్టుకు నిలబెట్టారు. ఇక్కడి పరిస్థితులను బట్టి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపి ఆంజనేయస్వామి విగ్రహాన్ని పక్కన వేప చెట్టుకు నిలబెట్టి, తవ్విన గుంతను మళ్లీ పూడ్చి వేశారు. విగ్ర హాన్ని వెలికితీసిన ప్రదేశంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు దీపారాధన ఒత్తులు, నువ్వుల నూనె డబ్బాలు పడి ఉన్నాయి. అటు వైపు పొలాలకు వెళ్లిన గొర్రెల కాపరులు చూసి గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్థులు వెళ్లి ఆంజనేయస్వామి విగ్ర హాన్ని పరిశీలించారు. అయితే ఈ ఘటన నాలుగైదు రోజుల క్రితం జరిగి ఉంటుం దని భావిస్తున్నారు. గతంలోనూ పాడుబడిన జనార్దనస్వామి ఆలయం గర్భగుడిలో దేవాతా మూర్తుల విగ్రహాలను సైతం పెకలించారు. ఆలయం ముందు ఉన్న రాతి ధ్వజస్తంభం కింద పలుమార్లు తవ్వకాలు చేపట్టారు.. అలాగే సమీపంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని గర్భగుడిలో శివలింగాన్ని పెకలించి ధ్వంసం చేశారు. గర్భగుడి ముందు ఉన్న నంది, ఆలయం ముందు ఉన్న మరో నంది విగ్ర హాలను తవ్వి అపహరించుకెళ్లారు. ఈ ఘటనలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో బరితెగించిన దుండగులు ఇప్పటికీ పాడుబడిన ఆలయ ప్రాంగ ణంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు భావిస్తున్నారు. వాస్తవానికి 15వ శతాబ్దం శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఈ ప్రాంతంలో 101 దేవాలయాలు, 101 చింత చెట్లు, 101 కోనేరులు ఉండేవని, అప్పట్లో ఈ ప్రాంతాన్ని పుచ్చకాయలరెడ్లు పాలించేవారని పూర్వీకులు చెబుతుండేవారు. అప్పట్లో విగ్రహాలను ప్రతిష్ఠించేటప్పుడు పంచలోహాలు వేసి ప్రతిష్ఠించేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని దుండగులు గుప్తనిధులు కోసం ఆ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దుండగులపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వలేటివారిపాలెం జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో గుప్తనిధుల కోసం తవ్వి వేప చెట్టుకు నిలబెట్టిన ఆంజనేయస్వామి రాతి విగ్రహం

తెలుగు హృదయాల్లో ఎన్టీఆర్ పదిలం

- జయంతి వేడుకల్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి
- ఆకట్టుకున్న ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శనలు

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారక రామారావు స్థానం పదిలంగా నిలిచి ఉంటుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ చలనచిత్ర నటుడు, పద్మశ్రీ డాక్టర్ ఎన్‌టీ రామారావు జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కార్తీక్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టిన ఏకైక నాయకుడన్నారు. పాలనలో అనేక సంస్కరణలతో పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతినకూడదనే గొప్ప లక్ష్యంతో పార్టీని స్థాపించి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం ఎన్టీఆర్ అని కొనియాడారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో మన రాష్ట్రం అన్నీ రంగాల్లో ముందంజలో పయనించేలా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.


కళాకారులను సన్మానిస్తున్న కలెక్టర్

కళా ప్రదర్శనలు.. సత్కారం

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, పౌరాణిక సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భాస్కర్, మధుసూదన్ పాడిన పుణ్యభూమి నాదేశం, జననీ జన్మభూమిశ్చ తదితర పాటలు, నరసింహారావు దుర్యోధన ఏకపాత్ర అభినయం అలరించాయి. కళాకారుల ను కలెక్టర్ ఆనంద్ సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దుర్యోధన ఏకపాత్రాభినయాన్ని తిలకిస్తున్న కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు, చిత్రంలో ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ కూడా చూడవచ్చు

ప్రత్యేక ఆకర్షణగా ఫొటో ఎగ్జిబిషన్

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినిమా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసేలా రూపొందించిన చిత్రాలు ఆనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చాయి. కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి, జేసీ కార్తీక్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, డీఆర్‌వో ఉదయభాస్కర్ ఈ ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. సమాచారశాఖ అధికారి సదారావును, సిబ్బందిని అభినందించారు.

వ్యవసాయ డిప్లమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతసాగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరానికి డిప్లమో కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని సోమశిల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ పల్లంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. (ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) అందించే 3 సంవత్సరాల డిప్లమో కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, జూన్ 16 వరకు అవకాశముందని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9247
వెండి కిలో ధర	రూ. 100700
వెండి ఒక గ్రాము	రూ. 103.70



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● షాలెట్, ఎంపీడీవో

సంగం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నైరుతి రుతుపవనాల వల్ల వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో షాలెట్ తెలిపారు.

? పల్లె పండుగ కార్యక్రమంలో మండలంలో సిమెంట్ రోడ్లకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి. పనులన్నీ పూర్తయ్యాయా.

ఈవారం ముఖాముఖి

! మండలంలో మొదటి, రెండవ విడత కలిపి రూ. 3.5 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20 పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు వేయడం జరిగింది. ఇక రెండు పనులు కొనసాగుతున్నాయి. త్వరలో పూర్తవుతాయి.

? పూర్తయిన సిమెంట్ రోడ్లు ప్రారంభించారా.

! ఇంకా ప్రారంభించలేదు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమయం కేటాయిస్తే ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తాం.

? మండలానికి కార్పొరేషన్ల వారీగా మంజూరైన రాయితీ రుణాలు ఎన్ని.

! బీసీ కార్పొరేషన్‌లో 31, ఎస్సీ కార్పొరేషన్‌లో 21, కాపు -4, రెడ్డి - 3, కమ్మ, ఈబీసీ కార్పొరేషన్‌లో రెండేసి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో ఒక్కొక్కటి చొప్పున రుణాలు మంజూరయ్యాయి.

న్యూస్ బాక్స్

సినిమా హాళ్ల తనిఖీ

వింజమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): సినిమా హాళ్లలో అధిక ధరలకు తినుబండారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు హమీద్ హెచ్చరించారు. బుధవారం స్థానిక సినిమా థియేటర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సినిమాకు వచ్చే ప్రేక్షకులపై అధి క భారం మోపవద్దని, హాల్‌లో విక్ర యించే తినుబండారాలు నిర్ణయించిన ధరకే అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్‌ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటం పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు గణపతి పూజ, అష్టోత్తర శతకళశ స్థాపన, శుక్రవారం క్షీర, పంచామృతాభిషేకం, హోమాలు, శనివారం యంత్రస్థాపన, ప్రాణప్రతిష్ఠ, స్వామివార్ల కళ్యాణోత్సవం, గ్రామోత్సవం ఉంటాయన్నారు. అలాగే వినాయకస్వామి, సరస్వతిదేవి, ధ్వజస్తంభం, విమాన శిఖర ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.

సోమశిలలో 43.345 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 43.345 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,000, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్రత్యేక గ్రీవెన్స్ వాయిదా

కలువాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం గురువారం జరగాల్సిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారానికి వాయిదా పడినట్లు తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు తెలిపారు. రైతులు ఈవిషయం గుర్తించి 30వ తేదీ ఆత్మకూరు ఆర్డీవో అధ్యక్షతన జరుగు కార్యక్రమంలో భూముల సమస్యలపై దరఖాస్తులు అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

అనంతసాగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి అన్వర్‌బాషా తెలిపారు.



ఆత్మకూరు: కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నేతలు



సంగం: ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న అధికారులు

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

వాడవాడలా ఘనంగా జయంతి వేడుకలు

ఆత్మకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం ఆత్మకూరు బీఎస్‌ఆర్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్రా వెంకటసుబ్బయ్యనాయుడు, మీరామోహిద్దీన్, కుక్కపల్లి శ్రీనివాసులునాయుడు, పచ్చా వెంగయ్య, ఇప్పగుంట పెంచలయ్య, రవి, మెంటా హజరత్‌బాబు, గుండాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **సంగం:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్, ఈవో ఆర్డీ వరప్రసాద్, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

● **కలువాయి:** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక టీడీపీ కార్యాయలంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, ఆంజనేయులు నాయుడు, వింజం మల్లికార్జున, హరిబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలలో అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు, టీడీ వెంకటేశ్వర్లు, ఎంఈవో శేషగిరిరావు, డిప్యూటీ ఎంపీడీవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఉదయగిరి:** టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. అలాగే ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, గడ్డం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నల్లిపోగు నరసింహ, ఉప్పుటూరి పెదవెంకటయ్య, మతకాల శ్రీనివాసులు, తుమ్మల కిరణ్, శివకృష్ణ పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దారు నాగరాజు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని విగ్రహాలతో సహా వెలుగు, తహసీల్దారు కార్యాలయాలు, సచివాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కల్పిస్తూ ఆసనాలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● **వింజమూరు:** పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల పరిషత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం :** మండల పరిధిలోని బసినేనిపల్లి, సీతారామపురం టీడీపీ కార్యాలయాలలో బుధవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ జయంతి వేడుకలను మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, మాజీ జడ్పీటిసి కలివెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో టీడీపీ నాయకుల నివాళి



సీతారామపురం : బసినేనిపల్లిలో కేట్ కట్ చేస్తున్న నాయకులు



వింజమూరు: ఎంపీడీవో ఆధ్వర్యంలో ...

కడపకు తరలుతున్న టీడీపీ శ్రేణులు

ఆత్మకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానాడు బహిరంగ సభకు భారీగా తరలి వెళ్లేందుకు టీడీపీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 250 ప్రత్యేక బస్సులు, మరో 250 సొంత వాహనాలతో గురువారం 15వేల మందితో చలో కడపకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో మండలాలు, గ్రామాలు, మున్సిపాల్టీ పరిధిలో వార్డుల వారీగా తెలుగు తమ్ముళ్ల తరలి వెళ్లేందుకు వాహనాలను ఏర్పాటుచేశారు. ఆత్మకూరు రూరల్, మున్సిపాల్టీ, చేజర్ల మండలం నుంచి తరలివెళ్లే టీడీపీ శ్రేణులకు ఏఎంసీ ప్రాంగణం వద్ద భోజనం ప్యాకెట్లు సరాఫరా చేయనున్నారు. సంగం, ఏఎస్‌పేట మండలాల నుంచి వెళ్లే వాహనాలకు ఆత్మకూరు హైవేలోని టిడ్కో సముదాయం వద్ద, అనంతసాగరం, మర్రిపాడు మండలాల నుంచే తరలి వెళ్లే వాహనదారులకు మర్రిపాడు హైవేలోని చుంచులూరు రాజుపాళెం సమీపంలో భోజనం ప్యాకెట్లు సరఫరా చేస్తారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కడప - బద్వేలు హైవేలో అందరికీ భోజన సదుపాయం ఏర్పాటుచేశారు.

మహానాడు బహిరంగ సభను జయప్రదం చేయాలి



టిడిపి నేతలతో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు

సీతారామపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో గురువారం జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు బహిరంగ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు కోరారు. స్థానిక పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6.30 గంటలకు సీతారామపురం మండల కేంద్రంలోని ఎల్.వి.ఆర్ కాలేజ్ హైవే జంక్షన్ వద్దకు రావాలని, అక్కడ 15 బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండలం నుంచి మహానాడుకు వెళ్లే వారికి పిపిగుంట దగ్గర 11 గంటలకు భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జయరాములు, వికాష్‌బాబు, గౌస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నేత విజయకుమార్‌కు ఘన నివాళి

ఉదయగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణు నర్సింగ్ హోమ్ ఆవరణలో బుధవారం జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ విజయకుమార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా సాధన సమితి, జేవీవీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్, జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, ఖాదర్‌బాషా, ఓబులరెడ్డి, రంతుజానీ, గౌస్‌బాషా, బోగ్యం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన డాక్టర్ విజయకుమార్‌రెడ్డి సేవలు ఎనలేనివని జేవీవీ నాయకులు కొనియాడారు. బుధవారం మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ పీఎం చలం, మండల ప్రధాన కార్యదర్శి డీవీ రమణయ్య, సభ్యులు జీ రమణయ్య, కృష్ణప్రసాద్, రాజు, రసూల్, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

5న వేలంపాట

ఉదయగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో శిథిలమైన భవనాల తొలగింపునకు వచ్చేనెల 5వ తేదీన పాఠశాల ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పరాజ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తుతోపాటు రూ.3,540 ప్రవేశ రుసుం డీడీ రూపంలో 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చెల్లించాలన్నారు. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 8712625047 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఎంపీడీవో

ఉదయగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, సర్పంచులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10న ఉదయగిరిలో నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, ఎంఈవో-2 శ్రీనివాసులు, వైద్యాధికారి శివకల్పన పాల్గొన్నారు.

● సంగం : యోగాతో మానసికప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో షాలెట్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు యోగా అభ్యసన కార్యక్రమం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజుకు అరగంట సమయం యోగాకు కేటాయిస్తే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

చౌకదుకాణ డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలి : డీటీ



డీలర్లతో మాట్లాడుతున్న డీటీ చంచయ్య

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో విధులు నిర్వర్తించే చౌకదుకాణ డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ తహసీల్దారు చంచయ్య సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానంలో భాగంగా జూన్ 1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాలను నిలిపివేయడం జరిగిందన్నారు. ఇకపై చౌకదుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను ఎలాంటి లోపాలు లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు నివాసాల వద్దకే వెళ్లి అందజేయాలన్నారు. రికార్డులను సైతం ఎప్పటికప్పుడు సమగ్రంగా నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత



చికెన్ వ్యర్థాలను గుంతలో వేయిస్తున్న అధికారులు

సంగం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని బుధవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. సంగం కూడలిలో వాహనాన్ని తనిఖీ చేయగా 11 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మత్స్య, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామ నిర్వహించి చికెన్ వ్యర్థాలను పూడ్చివేశారు. వాహనాన్ని సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ : ఒకరికి గాయాలు

సంగం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెక్‌పోస్టు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై స్కూటర్, కారు ఢీకొన్న సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఈప్రమాదంలో స్కూటర్ నడుపుతున్న చిట్టేటి రాగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు కారు వెళ్తుండగా కలిగిరి రహదారి నుంచి తిరుమనతిప్ప కాలనీలోకి వెళ్ళేందుకు స్కూటర్‌పై వస్తున్న చిట్టేటి రాగయ్య ఎడమ వైపు చూసుకోకుండా వేగంగా రావడంతో కారు, స్కూటర్ ఢీకొన్నాయి. ఈప్రమాదంలో రాగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఇన్‌చార్జి ఎస్ఐ సైదులు సంఘటన స్థలానికి చేరుకుని రాగయ్యను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

అనంతసాగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. హుండీ పగులగొట్టి అందులోని రూ. 4 వేల నగదు, వెండి వస్తువులు, మైక్ సామాగ్రి అపహరించారు. చోరీ విషయాన్ని బుధవారం గమనించిన అర్చకుడు తిరుపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

C.R.I.M.E N.E.W.S

అల్లూరులో మూడు చోట్ల చోరీ

● రూ.80 వేలు, 4 సవర్ల బంగారం అపహరణ



దుండగులు చెల్లాచెదురుగా పడేసిన బీరువాలోని దుస్తులు

అల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో మూడు చోట్ల చోరీ జరిగిన ఘటనలు బుధవారం వెలుగు చేశాయి. దీంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వివరాల మేరకు.. అల్లూరు గొల్లపాలెంవీధిలో నివాసం ఉంటున్న బేల్దారి మేస్త్రీ షేక్ రఫీ కుటుంబసభ్యులతో కలసి నాగూరులో మొక్కులు తీర్చుకునేందుకు గత ఆదివారం వెళ్లారు. బుధవారం తిరిగిరాగా ఇంట్లోని దుస్తులు, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గమనించి ఇంట్లో పరిశీలించగా కూలీలకు ఇవ్వాల్సిన రూ.80 వేల, 4 సవర్ల బంగారు వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే అల్లూరుపేట శివాలయం సమీపంలోని సాయిబాబా ఆలయంలో చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయం వెనుక వైపు నుంచి వచ్చి నిఘా కెమెరాల వైర్లను కట్ చేసిన అనంతరం ఆలయ తలుపులు పగలగొట్టాడు. అయితే ఆలయంలోని వస్తువులు దొంగిలించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని బలిజపాలెం వీధిలో నివాసం ఉంటున్న పప్పు పెంచలయ్య కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లడంతో దుండగులు తలుపుల తాళాలు పగులగొట్టి, ఇంట్లో వస్తువులు ధ్వంసం చేశారు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు పెంచలయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన బుధవారం రాత్రికి బయలుదేరి అల్లూరుకు రానున్నాడు. ఆయన వస్తేగానీ దొంగలు ఏమి అపహరించారో తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కిషోర్‌బాబు దర్యాప్తు చేపట్టారు.

సోమశిల దక్షిణ కాలువలో చిరుత కళేబరం



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కలువాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాత్మకూరు సమీపంలోని సోమశిల దక్షిణ కాలువలో ఓ చిరుత కళేబరాన్ని బుధవారం స్థానికులు గుర్తించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని కాలువలోనుంచి కళేబరాన్ని బయటకు తీసి పరిశీలించారు. చిరుత కళేబరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో నీటి కోసం కాలువలోకి దిగి తిరిగి రాలేక నీటిలో పడి మృతి చెంది ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. పంచనామా అనంతరం పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహిస్తామని కలువాయి డీఆర్వో ఖాజారసూల్, బీట్ ఆఫీసరు రాహుల్ తెలిపారు. చిరుతకు ఏడాది వయసు ఉంటుందని అంచనా వేశారు. కాగా, దక్షిణ కాలువకు ఇటీవలే కలువాయి చెరువు నుంచి 120 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు.

చేపల వేట నిషేధ సమయంలో ఎలా వస్తారు?



చెన్నై మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ

బిట్రగుంట, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సముద్రంలో చేపల వేట నిషేధం ప్రకటించి ఉన్న సమయంలో తమిళనాడు మత్స్యకారులు చేపల వేటకు ఎలా వస్తారని స్థానిక మత్స్యకార నాయకుడు త్యాగరాజు ప్రశ్నించారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో చెన్నై, కాసిమీడు ప్రాంతాలకు చెందిన 6 గిల్‌నెట్ బోట్లు బుధవారం నిలుపుకుని ఉండటం స్థానికులు గమనించారు. ఏపీలో చేపలవేట నిషేధం ఉందని, ఈ సమయంలో ఎలా వస్తారని ప్రశ్నించడంతో వారు ఎదురు తిరిగారు. దీంతో ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసుల దృష్టికి తీసుకుపోయారు. సమాచారం తెలుసుకున్న ఇస్కపల్లి మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సముద్రం అలజడిగా ఉండటం కారణంగా హార్బర్‌కు చేరామని, ఇటువంటి పరిస్థితులో తిరిగి వెళ్లలేమని చెన్నై మత్స్యకారులు తేల్చి చెప్పారు. అయితే ఎలాంటి గొడవలు జరగకుండా ఇరువురికి సర్ది చెప్పారు. ఈ విషయాన్ని మెరైన్ ఎస్ఐ ఉన్నతాధికారులకు తెలియచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కనీసం కూర కోసం కూడా చేపల వేట చేయకుండా ఉన్నామని, తమిళనాడు వాళ్లు మత్స్యసంపద దోచుకుపోవడం ఎంత వరకు సబబు అని స్థానిక మత్స్యకారులు మండిపడుతున్నారు.

రైల్లో 7.7 కేజీల గంజాయి స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ సుధాకర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో భాగంగా రైల్వే పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ తన కార్యాలయంలో తనిఖీల వివరాలను మీడియాకు వెల్లడించారు. కావలి, నెల్లూరు, గూడూరు రైల్వే పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆయా స్టేషన్లలో ఒడిశా వైపు నుంచి వస్తున్న రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ హరిచందన కలిసి టాటానగర్-ఎర్నాకులం రైల్లోని జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా మదుకూరు ప్రాంతానికి చెందిన ఎస్ మహమద్ సమీర్, గుణశేఖర్ దీపక్, కర్నాటక రాష్ట్రం చిక్‌మంగ్‌లూరు జిల్లా చిక్కాంగల ప్రాంతానికి చెందిన ఎస్ హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 7.7 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా ఒడిశా - ఏపీ సరిహద్దు జిల్లాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రం జోలార్‌పేట పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు చెన్నకేశవ, హరిచందన, సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, మణికంఠను రైల్వే డీఎస్పీ జీ. మురళీధర్ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 525

4 నుంచి జనార్దనస్వామి ఆలయ భూముల కౌలు వేలం

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్కంధపురి జనార్దనస్వామి ఆలయానికి సంబంధించి కందుకూరు పట్టణం, మహదేవపురం, ఉలవపాడు మండలం కరేడు గ్రామాల పరిధిలో ఉన్న 154.31 ఎకరాల వ్యవసాయ భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు జూన్ 4, 5 తేదీలలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి భైరాగిచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు పట్టణ పరిధిలో 134.05 ఎకరాలకు, మహదేవపురంలో ఉన్న 4 ఎకరాల భూమికి 4వ తేది ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. కరేడు గ్రామంలో ఉన్న 16.26 ఎకరాల భూమికి జూన్ 5న ఉదయం 10 గంటలకు కరేడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. బహిరంగ వేలంలో భూములను కౌలుకు పాడుకున్న రైతులకు ఈ ఏడాది నుంచి మూడేళ్లపాటు సాగు చేసుకునే హక్కులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. పాటలో పాల్గొనదలచిన రైతులు ఒక్కో ప్లాటుకు రూ.5వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని, హెచ్చుపాటదారులు ఒక ఏడాది కౌలు తక్షణం చెల్లించాలని తెలిపారు.

మా బిడ్డను ప్రభుత్వమే ఆదుకోవాలి

● బాధిత సచివాలయ ఉద్యోగి తల్లిదండ్రులు

కొండాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై కుడి చేయి మణికట్టు వరకు తొలగించడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ కుమారుడు మహే‌ష్‌ను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు మండలంలోని సాయిపేటకు చెందిన బీ.శ్రీహరి, సరస్వతి దంపతులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ తమ పెద్ద కుమారుడు మహేష్ పార్లపల్లి సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడని, విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పునరుద్ధరణ పనుల్లో భాగంగా గత సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కాలిపోయాయన్నారు. పక్కనే ఉన్న సిబ్బంది వింజమూరుకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారన్నారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించగా శస్త్ర చికిత్స చేసి కుడిచేయి మణికట్టు వరకు తొలగించారన్నారు. ఇదిలా ఉండగా మహేష్ తండ్రి శ్రీహరి ఇటీవల అనారోగ్యానికి గురవ్వగా దాదాపు రూ.26 లక్షల అప్పులు తెచ్చి వైద్యం చేయించుకున్నారు. ఇదే సమయంలో కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడుకి ఇలా జరగడంతో అతని వైద్యం కోసం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుందని తల్లి సరస్వతి ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. బాధితుడి మహే‌ష్‌కు భార్య, రెండేళ్లలోపు పాప ఉన్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం తమ బిడ్డను ఆదుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అర్జీలు పరిశీలిస్తున్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు శాఖలకు సంబంధించి 10 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం చుండి గ్రామంలో ఆక్రమణలో ఉన్న మహాలక్ష్మమ్మ దేవాలయం స్థలం, రాజుగారికోట స్థలంను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఎస్ఐ మరిడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటకరాణి కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, మే 28(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన ఎన్టీఆర్ వీరాభిమాని నాటకరాణి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం పలువురు టీడీపీ నేతలు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంజయ్య కుమారుడు, బీసీ నేత నాటకరాణి భాస్కర్, తిరుపతయ్యలకు మండల కన్వీనర్ నాగేశ్వరరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎన్.సుధీర్‌బాబు, ఎన్.శీనయ్య, బోగిరి ప్రభాకర్, ఐ.రామోహన్‌రెడ్డి, ఎన్.రంగయ్య, అహ్మద్‌బాషా తదితరులు ఉన్నారు. అలాగే ఏబీకండ్రికకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గద్దే కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కొలతలు ప్రకారమే వేతనాలు

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఉపాధిహామీ ఏపీవో దయాసాగర్ తెలిపారు. మండలంలోని కొండారెడ్డిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. స్వయగా మస్టర్లను చదివి వినిపించారు. ఈ సందర్భగా ఏపీవో మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకు పనులకు వెళ్లి తిరిగి 10 గంటలకు ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

● వాడవాడలా అట్టహాసంగా జయంతి వేడుకలు

● ఘన నివాళులర్పించిన అధికారులు, టీడీపీ శ్రేణులు, అభిమానులు



కావలి : ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు



కందుకూరు : ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు



కావలిరూరల్ : పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కావలి, మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆరాధ్య దైవం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ శ్రేణులు కొనియాడారు. ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. కావలి మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహనికి టీడీపీ నేతలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలలకే అధికారం చేపట్టి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపనతో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. తెలుగు సినీ పరిశ్రమకు అందించిన ఖ్యాతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోట్లూరి శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, యేగూరి చంద్రశేఖర్, గురుస్వామి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త, తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసునూరులో ఎన్టీఆర్ విగ్రహనికి టీడీపీ నేత బొట్లగుంట శ్రీహరినాయుడు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కలిగిరి : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

● కావలి రూరల్ : కావలి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కొత్తపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి చిమ్మిలి శ్రీహరినాయుడు, పంచాయతీ కార్యదర్శి కత్తుల రాజేష్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కందుకూరు : కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి మధు, గోచిపాతల మోషే, ఎన్వీ రమణయ్య, గొంది నరసింగరావు, రూబీ, జియా, పొన్నగంటి వెంకటరావు, మంగపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పందలపాగులో గ్రామపార్టీ అధ్యక్షుడు కూనం లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు జెండా ఆవిష్కరణ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.



కొండాపురం : కేకు కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● కొండాపురం : మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షుడు పీ.రమేష్, తెలుగుయువత మండల అధ్యక్షుడు దాసరి అశోక్, తెలుగుయువత మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీను, గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, టీడీపీ నాయకులు నరేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి : మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రనాథ్, ఎంపీడీవో ప్రత్యూష, ఎస్ఐ ఉమాశంకర్, రెవెన్యూ, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అల్లూరు : అల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, అరగల రమణయ్య, మేడా శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, మేడా శ్రావణ్ కుమార్ రెడ్డి, కావలి జగన్మోహన్‌రావు, మునిరాజా, పఠాన్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు, సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా సచివాలయాలు, ఇతర శాఖ కార్యాలయాల్లో అధికారులు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా మహానాడుకు మండలం నుంచి రెండు బస్సులు, 10కి పైగా టెంపోలు, కార్లలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం తరలి వెళ్లారు. కరేడు, ఉలవపాడు మేజర్ పంచాయతీలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బస్సులు కేటాయించారు.

● జలదంకి : మండలం బ్రాహ్మణక్రాక పంచాయతీ తొమ్మిదోమైలు ఎన్‌హెచ్ 167బిజి జాతీయ రహదారి కూడలిలో టీడీపీ నాయకులు గంగపట్ల మాలకొండయ్య, స్వర్ణ కొండపనాయుడు, డాక్టర్ వీవీ రమణయ్యలు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు తల్లపనేని మధుసూదనరావు, కొల్లా కృష్ణ, పున్నం రోశిరెడ్డి, వడ్డే శ్రీనివాసులు, కూరపాటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

● బిట్రగుంట : బోగోలు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయింతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, ఐ.రామోహన్‌రెడ్డి, ఎల్.మాధవరావు, బీ.ప్రభాకర్, రమణయ్య, అహ్మద్ బాషా, రఫీభాయ్, తదితరులు పాల్గొన్నారు



ఉలవపాడు : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది



జలదంకి : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



బిట్రగుంట: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

అంతా గందరగోళం

(3వ పేజీ తరువాయి)

హెల్త్ అసిస్టెంట్లకు సర్దుబాటు బదిలీల్లో మినహాయింపు ఇవ్వడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

● **వారికి బదిలీలు లేవట!**

మరోవైపు జిల్లా కార్యాలయంలోని ఫైలేరియా విభాగంలో 8 మంది, మలేరియా విభాగంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే వీరిని బదిలీల కౌన్సెలింగ్ జాబితాలో మాత్రం చేర్చలేదు. నెల్లూరుకు కూత వేటు దూరంలో ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ల పేర్లను తొలి జాబితాలో చేర్చి ఆ తర్వాత తొలగించారు. దీని వెనుక మర్మమేమిటో అధికారులే చెప్పాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. తాజాగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలోనూ హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పోటీ ఎక్కువైంది. నగరంలోనే 20 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, కావలిలో 4, కోవూరు. ఆత్మకూరులలో ఒక్కొక్కటి చొప్పున ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ హెల్త్ అసిస్టెంట్లను కొత్తగా నియమిస్తున్నారు. మరోవైపు ఆత్మకూరు, మహమ్మదాపురం, కలువాయి, పొదలకూరు, చిరమన, చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ అసిస్టెంట్ల అవసరం ఉన్నా ఆ దిశగా అధికారులు జాబితా తయారు చేయక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే!

వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ సర్దుబాటు బదిలీలు జరుగుతున్నాయి. ఈ నెల 27న కౌన్సెలింగ్ జరగాల్సి ఉన్నా ఉద్యోగుల అభ్యర్థన మేరకు 30కి వాయిదా వేశాము. మలేరియా విభాగం ఆదేశాలతోనే హెల్త్ అసిస్టెంట్ల జాబితా తయారు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కౌన్సిలింగ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తున్నాము.

\- సుజాత, డీఎంహెచ్‌వో

సినిమా హాళ్లపై రెవెన్యూ దాడులు



కావలిలోని థియేటర్లలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), మే 28 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లపై చర్చ సాగుతున్న సమయంలో జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు ప్రారంభించారు. థియేటర్లలో టికెట్లు, తినుబండారాలు, కూల్ డ్రింక్స్ ధరలు, పారిశుద్ధ్యం, అగ్నిమాపక శాఖ అనుమతులు, సౌకర్యాలు ఇలా అనేక అంశాలపై తనిఖీలకు తెర లేపారు. నెల్లూరు, కందుకూరు, కావలి ఆర్డీవోలు నాగ సంతోష్ అనూష, శ్రీపూజ, సన్నీ వంశీకృష్ణ ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. నగరంలో ఎమ్మార్వో షఫీమాలిక్ తనిఖీలు చేశారు. ఈ రిపోర్టును ప్రభుత్వానికి అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సినిమా టికెట్ల ధర పెంచితే చర్యలు

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): సినిమా హాళ్లలో టికెట్ల ధరలు పెంచినా, తినుబండారాలు అధిక ధరలకు విక్రయించిన ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. బుధవారం కందుకూరు పట్టణంలోని ప్రశాంతి, కోటేశ్వర, యువరాజ్ థియేటర్లకు ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, సీటింగ్ సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. క్యాంటీన్‌లలో వివిధరకాల పదార్థాలు విక్రయ ధరలు, టికెట్ల ధరలు తదితర అంశాలను పరిశీలించారు. ఆయా థియేటర్లలో లైసెన్స్‌డ్ ఆపరేటర్లు ఉన్నారా లేదాని విచారించారు. ఆయా థియేటర్ల మేనేజర్లతో మాట్లాడి మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత మెరుగుపరచుకోవాలని సూచించారు. క్యాంటీన్‌లలో వస్తువులు అధిక ధరలకు విక్రయించినా టికెట్లపై అధికధరలు వసూలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు థియేటర్ల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని సబ్‌కలెక్టరు వివరించారు.

కావలి : పట్టణంలోని మానస, శ్రీవెంకటేశ్వర, స్పందన థియేటర్లను తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్‌తో కలిసి కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణ తనిఖీ చేశారు. ఆ సమయంలో సినిమా ప్రదర్శనలు లేకపోవటంతో థియేటర్లలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతులు. ఫైర్ పరికరాలు, సీటింగ్ కెపాసిటీ, పార్కింగ్ తదితరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సినిమా టికెట్ ధరపై రికార్డులను, కంప్యూటర్లను పరిశీలించారు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్‌లలో తినుబండారాలు, వాటర్‌బాటిల్స్, కూల్ డ్రింక్స్ ఎమ్మార్పీకి విక్రయిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అయితే వారు తనిఖీలకు వెళ్లిన సమయంలో సినిమా ప్రదర్శనలు లేకపోవటంతో థియేటర్ల నిర్వాహకులు అన్ని నిబంధనల మేరకే జరుగుతున్నాయని చెప్పడంతో వాటిని క్రాస్ చెక్ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

లింగసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లింగసముద్రంలోని విజయలక్ష్మి. బాలాజీ థియేటర్లను తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఆర్ఐ ఎం రమణయ్యలు తనిఖీ చేశారు. వీరి వెంట వీఆర్వో మస్తాన్‌వలి ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కావలి, మే 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో పనిచేస్తున్న దినసరి పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా జీతలు ఇవ్వలేదని, వెంటనే వారికి జీతాలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ కార్మికసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ దినసరి పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వనందున నిరుపేదలైన వారి కుటుంబాలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కరోనా కాలం నుంచి పని చేస్తున్న వారికి తక్కువ జీతాలు ఇస్తూ ఎక్కువ పనులు చేయిస్తున్నారని చెప్పారు. వారందరినీ ఆప్కాస్‌లో చేర్చుకుని 60 ఏళ్లకు పదవీవిరమణ పొందిన వారికుటుంబ సభ్యులలో ఒకరికి పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిరదల మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో గ్రామీణ రహదార్లు!

● పట్టించుకోని అధికారులు



కలిగిరి-కొండాపురం ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

కలిగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రధాన రహదారులు దుస్థితిలో ఉన్నాయి. అడుగడుగున గుంతలు పడి, వర్షం వస్తే ఆ గుంతల్లో నీరు చేరి ప్రమా దకరంగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతోన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. అయితే విధుల్లో అలసత్వమో ఏమోకానీ కొందరు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కలిగిరి నుంచి కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రహదారుల్లో నిత్యం సామాన్య ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు ప్రయాణాలు చేస్తున్నా రహదారుల దుస్థితిపై ఎవరూ పట్టించుకున్న దాఖాలాలు కనిపించడం లేదు. కలిగిరి-సంగం రహదారిలో పాతనాపురం నుంచి హసనాపురం మధ్య సింగిల్‌రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. కలిగిరి-కొండాపురం మార్గంలో పలుచోట్ల రహదారులు గుంతలు తేలి ఆనవాళ్లు లేకుండా పోయాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారు ప్రాంతంలో తారురోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిపోయింది. ఈ గుంతల వద్ద రోడ్డు పరిస్థితి అంచనా వేయలేకపోవడంతో అదుపుతప్పి పడి గాయపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా సరే వారం రోజులపాటు నీరు నిల్వ చేరి వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. వర్షపునీరు బురదమయంగా మారి, దుర్వాసన వెదజల్లుతూ అంటురోగాలకు కారకం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గాలవద్ద రహదారులకు మరమ్మతులు నిర్వహించి వాహనదారుల కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం

కలిగిరి శివారు ప్రాంతంలో రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో 350 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. స్థానికుల ఇళ్లు రోడ్డు పైకి చొచ్చుకుని రావడంతో పనులు మొదలు కాలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం.

\- అహ్మద్‌బాషా, జేఈ,ఆర్అండ్‌బీ, కావలి డివిజన్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కలిగిరి మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు దూబగుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడి పందెం స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కోళ్లు, రూ.2,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు మండలంలోని అంకభూపాలపురంనకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కమంతులు మాల్యాద్రి, పంది లక్ష్మీనారాయణ, చెంచు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలిగిరిలో పొగాకు ధరలు

కలిగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 532 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 437బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-80, ఆర్ఆర్-4, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 95బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.240.67గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



వలేటివారిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవారిపాలెంలో గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న రామాలయంను కూలదోసి రూ.70 లక్షలతో నూతన రామాలయం నిర్మించారు. అందులో సీతారాములు విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 29 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


తెలుగుజాతికి ఆదర్శం ఎన్టీఆర్



కళాకారుల నృత్య ప్రదర్శన - ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి ఆదర్శప్రాయుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఎన్టీ ఆర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. ఎన్టీఆర్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రూ.2కే కిలో బియ్యం, గురుకుల సంక్షేమ వసతి గృహాలు, ఉచిత విద్య, స్కాలర్‌షిప్ వంటి పథకాలు.. తెలుగుగంగ ప్రాజెక్టు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. వీటితో ఆయన చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మండ్, దేవేందర్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, జిల్లా కోఆపరేటివ్ పీడీ లక్ష్మి, డీఈవో కుమార్, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకు ఆయన ఉన్న డైరెక్టర్ ఛాంబర్‌లోనే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వైద్యులు, వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, ఇతర నేతలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ మళ్లీ అవే మెయిల్స్

ఏడు నెలలుగా తిరుపతికి బాంబు బెదిరింపులు ● తాజాగా కలెక్టరేట్‌కు, వ్యవసాయ కళాశాలకు

మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తాం.

గతేడాది అక్టోబరు 24న ఉదయం 11.56 గంటలకు మొదలైన ఈ తరహా బెదిరింపు ఈ-మెయిల్స్ ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. తాజాగా తిరుపతి కలెక్టరేట్‌కు రెండోసారి.. వ్యవసాయ కళాశాలకు మూడోసారి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఎప్పటిలాగే.. ఇవీ ఉత్తుత్తివేనని నిర్ధారణ అయ్యాయి.

తిరుపతి(నేరవిభాగం), మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిని లక్ష్యంగా చేసుకుని ఏడు నెలలుగా... తరచూ బాంబు బెదిరింపు మెయిల్స్ వస్తూనే ఉన్నాయి. తొలిసారిగా నాలుగు హోటళ్లకు మెయిల్స్ రావడంతో ఆందోళన మొదలైంది. తమిళనాడులో జాఫర్ షాదిక్‌కు జైలు శిక్ష విధించిన క్రమంలో బాంబులు పెట్టినట్లు ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట మెయిల్స్ రావడంతో పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ల సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అదే రోజున తిరుపతి మీదుగా నడిచే స్టార్ ఎయిర్ లైన్స్ విమానాన్ని బాంబుతో పేల్చివేస్తామంటూ ట్విట్టర్ ద్వారా అగంతకుడొకరు బెదిరించారు. మూడు రోజుల వ్యవధిలోనే అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌ను పేల్చేస్తామంటూ ఆలయంలో అతిథి గృహాలు బుక్‌చేసే ఐడీకి మెయిల్ వచ్చింది. అదే రోజున మరో ఆలయంతో పాటు ఐదు హోటళ్లకూ ఇదే తరహా మెయిల్స్ రావడంతో పోలీసులు గంటలపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఆ తర్వాత కొన్ని మెయిల్స్ వచ్చాయి. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్ వచ్చింది. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు హార్దిక్ పీటర్స్ అనే వ్యక్తి మెయిల్ ఐడీ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ అధికార మెయిల్ ఐడీకి మార్చి 21న మెయిల్ వచ్చింది. ఇలా దుండగుల నుంచి మెయిల్స్ రావడం.. పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టడం.. బాంబులు, పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించడం పరిపాటిగా మారింది. ఇక్కడితో ఆగిందనుకున్న ఈ బెదిరింపుల మెయిల్స్ బుధవారం మళ్లీ కలెక్టరేట్‌కు.. మూడోసారి వ్యవసాయ కళాశాలకు వచ్చాయి. దీంతో కొంత కలకలం రేపింది. ఇలా తిరుపతికి వరుస పెట్టి బాంబు బెదిరింపు మెయిల్స్ పంపుతున్నది ఎవరు? ఎక్కడ నుంచి పంపుతున్నారు? అనేది పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో అదే తరహా మెయిల్స్ వస్తున్నాయి.

రెండోసారి కలెక్టరేట్‌కు..!

● తమిళనాడు నుంచి బాంబు బెదిరింపు మెయిల్


కలెక్టరేట్‌లో పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తనిఖీ చేస్తు బాంబ్ స్క్వాడ్

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌కు రెండోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. జైస్మాల్ ముస్తాక్ సవుక్కు శంకర్ మద్రాస్ టైగర్స్ పేరిట జేసీ శుభం బన్సల్‌కు మంగళవారం సాయంత్రం అధికారికంగా మెయిల్ చేశారు. పాక్ జిందాబాద్.. జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌డీఎక్స్ అమర్చామని అందులో పేర్కొన్నారు. అందులో సోమవారం మధ్యాహ్నం 1.13 గంటలకు బాంబులు పేలేలా అమర్చామని ఉండటం గమనార్హం. వెంటనే అధికారులు ఈ మెయిల్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫార్వార్డ్ చేసి సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించిన పోలీసు అధికారులు ఎలాంటి అనుమానాస్పద అంశాలూ లేవని నిర్ధారించుకున్నారు. బుధవారం ఉదయం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్కింగ్‌లోని వాహనాలను తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోనూ తనిఖీచేసిన బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది చివరికి అంతా ఉత్తిదేనని తేల్చడంతో కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ మార్చి 21న ఇదే తరహాలో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.

మూడోసారి వ్యవసాయ కళాశాలకు..


కళాశాలలో బాంబు డిస్పోజల్ స్క్వాడ్ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),మే28 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు మూడోసారి బాంబు బెదిరింపుమెయిల్ వచ్చింది. శివదాస్ మీనా అనే పేరుతో ఉదయం 9గంటలకు ఈమెయిల్ అందింది.అందులో అఫ్జల్ గురూను ఉరితీసినందుకు, తమిళనాడులో సవుక్కు శంకర్ పట్ల డీఎంకే వ్యవహరించిన తీరుకు 2నిరసనగా కాలేజీలో పైప్ బాంబులు అమర్చినట్టు పేర్కొన్నారు. ఇవి ఏ క్షణమైనా పేలే అవకాశాలున్నాయని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. ఈ మెయిల్ విషయమై రూరల్ సీఐ చిన్నగోవిందుకు అధికారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలకు చేరుకుని ప్రిన్సిపల్, డీన్, రిజిస్ట్రార్ చాంబర్లతో పాటు తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌లు, కళాశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ పరికరాలతో తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని అంతా ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. ఈ వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్ రావడం ఇది మూడోసారి.

ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్‌పై గజరాజుల దాడి

● ఇద్దరికి గాయాలు


బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద గజసంచారం


గాయపడ్డ మునస్వామి, లక్ష్మీప్రసాద్

ఎర్రావారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట కేంద్రంగా పనిచేసే ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులపై గజరాజులు దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. ఎర్రావారి పాలెం మండలం ఎల్లమంద పంచాయతీ బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద ఏనుగుల గుంపు కదలికలున్నాయనే సమాచారం వీరికి అందింది. అదే సమయంలో డ్రోన్ల ద్వారా గజరాజుల కదలికలను గుర్తించిన టాస్క్‌ఫోర్స్‌లోని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మునస్వామి, ఎల్లమంద ఎఫ్‌బీవో ప్రసాద్, లక్ష్మీ ప్రసాద్, సిబ్బంది బుధవారం సాయంత్రం బత్తలగుట్టకు వెళ్లారు. గజరాజులను అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా జంట ఏనుగుల్లో ఒకటి అధికారులపైకి దూసుకొచ్చింది. ఈ హఠాత్పరిణామంతో వారు చెల్లాచెదురై పరుగెత్తి ప్రాణాలు దక్కించుకొనే క్రమంలో ఎఫ్ఎస్‌వో మున స్వామి, గార్డు లక్ష్మీ ప్రసాద్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వాహనంలో తిరుపతికి తరలించారు. గాయపడిన అధికారులకు మెరుగైన చికిత్స అందించేందుకు రేంజర్ వెంకట్రమణ సకాలంలో చర్యలు చేపట్టారు. మండలంలోని కోటకాడపల్లె, ఎల్లమంద, ఉస్తికాయల పెంట పంచాయతీల్లో రైతులు పొలాలకు రాత్రి పూట వెళ్లరాదని సూచించారు.

తెలుగుగంగ ఎస్ఈగా విజయ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈగా పి.విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఎస్ఈగా పదోన్నతి కల్పించింది. ఆ పదోన్నతిపై ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల సర్కిల్‌కు బదిలీ చేసింది.



'మహానాడు' సభకు భారీగా జనం

● జిల్లా నుంచి 20 వేల మంది హాజరవుతారని అంచనా



టీడీపీ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో గురువారం జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు బహిరంగసభకు జిల్లా నుంచీ భారీగా జనం తరలుతున్నారు. మహానాడు తొలి, మలి రోజు కార్యక్రమాలకు ఐదు వేల మందికిపైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. గురువారం సాయంత్రం ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగసభలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో శ్రేణులు ఉదయం కడపకు బయలుదేరనున్నారు. జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచీ 335 బస్సులు కేటాయించారు. ఇందులో అన్నమయ్య జిల్లా కోడూరు నియోజకవర్గానికి 60, రాజంపేటకు 75 చొప్పున పంపించారు. మిగిలిన 200 బస్సులను జిల్లాలో నియోజకవర్గాల వారీగా పంపించారు. బుధవారం రాత్రి 10 గంటలకు ఆయా నియోజకవర్గాలలోని మండల కేంద్రాలకు చేరేలా బస్సులను పంపించారు. ఆర్టీసీకి సంబంధించి ఇంత భారీ సంఖ్యలో బస్సులను నాయకులు బుక్ చేయడం ఇదే తొలిసారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

- తొలిరోజే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ వెంట అన్ని మండలాల నుంచీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు భారీగా తరలి వెళ్లారు. బహిరంగసభకు గురువారం ఉదయం మరో రెండు వేల మంది బయల్దేరి వెళ్ళనున్నారు. చంద్రగిరి నుంచి ఐదు బస్సులు, తిరుపతి రూరల్ నుంచీ మూడు బస్సులు, వంద కార్లు, జీపులు, పాకాల నుంచీ 5 బస్సులు, ఆర్సీపురం నుంచీ రెండు బస్సులు, చిన్నగొట్టిగల్లు నుంచీ రెండు బస్సులు, 30 కార్లు, జీపులు, ఎర్రావారిపాలెం నుంచీ మూడు బస్సులు, పది చిన్న వాహనాల్లో బయల్దేరుతున్నారు.
- శ్రీకాళహస్తి నుంచీ ఇప్పటికే సుమారు 500 మంది వెళ్ళగా బహిరంగ సభకు 70 బస్సులు, ఇతర వాహనాల్లో 5 వేల మంది వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు.
- గూడూరు నుంచీ ఇప్పటికే 27 బస్సులు, ఇతర వాహనాల్లో వెయ్యి మంది వెళ్లారు. బహిరంగసభకు 60 బస్సులు, 40 టెంపోలు, ఇతర వాహనాల్లో నాలుగు వేల మంది బయల్దేరడానికి సన్నాహాలు చేసుకున్నారు.
- సూళ్లూరుపేట నుంచీ గురువారం ఉదయం 25 బస్సులు, వంద కార్లు, జీపుల్లో 5 వేల మంది బయల్దేరడానికి సిద్ధమవుతున్నారు.
- వెంకటగిరి నుంచీ 110 బస్సులు, 200 కార్లలో 5 వేల మంది బయల్దేరుతున్నారు.
- నగరి నుంచీ ఇప్పటికే వెయ్యి మంది వరకూ కార్యకర్తలు మహానాడులో ఉండగా, బహిరంగసభకు గురువారం ఉదయం 80 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు ఇతర వాహనాల్లో 5 వేల మంది వెళ్లనున్నారు.
- తిరుపతి నుంచీ 30 బస్సులు, వందకు పైగా కార్లు, జీపుల్లో 5 వేల మంది బహిరంగసభకు ప్రయాణవుతున్నారు.
- సత్యవేడు నియోజకవర్గం నుంచీ ఇప్పటికే 500 మందిదాకా మహానాడులో వుండగా గురువారం ఉదయం 20 బస్సులు, ఇతర వాహనాల్లో 1500 మంది బయల్దేరనున్నారు.

CUB TRUST AND EXCELLENCE SINCE 1904

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్,
కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు: నం.1) శ్రీ హేమ చంద్ర నాయుడు, తండ్రి శ్రీ ఎ. రామచంద్ర, మద్దిపట్లపల్లె గ్రామం, ఎం. పైపల్లె పోస్ట్, బరాల మండలం, చిత్తూరు జిల్లా, నం.2) శ్రీ టి.గోవింద రాజులు, తండ్రి ఎ. రామచంద్ర నాయుడు, బువనేశ్వర్ కండ్రిగ గ్రామం,నరగల్లు పోస్ట్, చిత్తూరు మండలం, చిత్తూరు జిల్లా, నం.3) శ్రీమతి గీత, భర్త ఎ. హేమచంద్ర నాయుడు, మద్దిపట్లపల్లె గ్రామం, ఎం. పైపల్లె పోస్ట్, బరాల మండలం, చిత్తూరు జిల్లా, నం.4) మెస్సర్స్ విజేత ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ప్రాతినిధ్యం వహించు దాని చైర్మన్ శ్రీ గోవింద రాజులు మరియు సెక్రటరీ శ్రీ ఎ. హేమ చంద్ర నాయుడు, నం. 20-189, మసీదు వీధి, మిట్టూరు, చిత్తూరు వారు బ్యాంకుకు రావలిసిన బకాయిలు, ఇతర ఖర్చులు, 27.05.2025 నుండి చార్జి చేయబడే ఇతర వడ్డీతో 26.05.2025 నాటికి రూ.1,95,64,440/- (రూపాయలు ఒక కోటి తొంభై ఐదు లక్షల అరవై నాలుగు వేల నాలుగు వందల నలభై మాత్రమే) లను రాబట్టుకొనుటకు SARFAESI చట్టం 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూలు8(6) & 9 క్రింద సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ అయిన అధీకృత అధికారిచే దిగువ తనఖా పెట్టిన అస్తులను రీ-టెండరు-సహిత-బహిరంగ ప్రకటన వేయబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి
(శ్రీ హేమచంద్ర నాయుడు, తండ్రి శ్రీ ఎ.రామచంద్ర నాయుడు మరియు శ్రీ టి. గోవింద రాజులు తండ్రి ఎ. రామచంద్ర నాయుడుకి చెందిన అస్తులు)

చిత్తూరు జిల్లా, చిత్తూరు రూరల్ సబ్-జిల్లా, చిత్తూరు జిల్లా పరిషత్, చిత్తూరు మండలం, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్, 77 గాండ్లపల్లె రెవిన్యూ గ్రామ పరిధులు, S.No.9/1, కొంగారెడ్డిపల్లి, అంధ్రప్రదేశ్. S.No. 9/1లో ప్లాట్ నం.2లో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌సిసి రూఫ్ నివాస భవనం మరియు ఖాళీ స్థలం. సరిహద్దులు: తూర్పు: ఎం.జి. దేవరాజులుకు చెందిన ప్లాట్ నం.3, పశ్చిమం: డా. కె.ఎన్. అమర్నాథ్ కి చెందిన ప్లాట్ నం.1 మరియు డా. మీనా కుమారి డి.నం. 27/6, ఉత్తరం: సి.ఎ. మడి భూమి, దక్షిణం: 18 అడుగుల రోడ్. కొలతలు: తూర్పు నుండి పశ్చిమం: దక్షిణం వైపు 42.0 అడుగులు లేదా 12.77 మీటర్లు, ఉత్తరం వైపు (16, 25, 6¾) మొత్తం 47¾ అడుగులు లేదా 14.51 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం: పశ్చిమం వైపు 48 అడుగులు లేదా 14.60 మీటర్లు, తూర్పు వైపు 59 అడుగులు లేదా 17.94 మీటర్లు, మొత్తం విస్తీర్ణం 2,414 చ.అడుగులు లేదా 268.22 చ.గజాలు.

రిజర్వు ధర: రూ. 2,48,00,000/-
(రూపాయలు రెండు కోట్ల నలభై ఎనిమిది లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
26-06-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిత్తూరు శాఖ: వైల్ ఖన్నా స్ట్రీట్, నాయుడు బిల్డింగ్, చిత్తూరు-517001. టెలిఫోన్ నం.08572-220022, సెల్ నం.9390634373

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/అమె కొరకే అతను/అమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిత్తూరు శాఖ, వైల్ ఖన్నా స్ట్రీట్, నాయుడు బిల్డింగ్, చిత్తూరు-517001 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్టు / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. అస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.08572-220022, సెల్ నం.9390634373లను సంప్రదించ వచ్చును. 5. అస్తి / అస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు అసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి.11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 27.05.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

SRI VENKATESWARA UNIVERSITY - TIRUPATI
TENDER NOTICE

Sealed Tenders are invited from the Registered Catering Contractors and Hoteliers by the Registrar, Sri Venkateswara University. Tirupati, for running the ANNAPURNA CANTEEN, near Administrative Building, S.V.U. Campus, Tirupati. The blank tender schedules will be issued on payment of Rs. 2250/- (Rupees Two thousand two hundred fifty only) including GST for canteen, by way of Bank Demand Draft, drawn in favor of the Registrar, S.V. University, Tirupati.

1.Last date for issue of Tender application on	: 10-06-2025 at 04-30 P.M.
2. Last date for receipt of filled in Tenders Along with E.M.D. amount on	: 12-06-2025 at 04-30 P.M.
3.Date of opening of Tenders (i) Technical Bid on	: 13-06-2025 at 3-00 P.M.
(ii) Financial Bid on	: 13-06-2025 at 4-00P.M.

For other details please contact the undersigned.
Telephones: (1) 0877-2289414, (2) 0877-2289354, (3) 0877- 2289382
Website: http://www.svuniversity.edu.in
Advt. No. D1/12124/Canteen Tenders/2025, dt.29-05-2025
Sd/- **M.BHUPATHI NAIDU**, Registrar





హుండీ లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,72,70,504 వచ్చింది. బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73.200 గ్రాములు, వెండి 607.100 కిలోలు, విదేశీ కరెన్సీ 92 వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు సహకారం అందించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): మామిడి జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు అధికారులు అన్ని విధాలుగా సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకు అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించారు. మామిడిజ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకువారు మంజూరు చేసిన రుణాలను రీషెడ్యూల్ చేసి వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,597

తలనీలాలు సమర్పించినవారు: 30,803



ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచారం

● నేడు ఎస్వీ జూపార్కులో ప్రారంభం ● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజల్లో యోగాపట్ల అవగాహన పెంచేందుకు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. పది లక్షల మందికి అవగాహన కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పర్యాటక శాఖ ద్వారా జిల్లాలో ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఉదయం తిరుపతి ఎస్వీ జూపార్కులో మొదటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 4న చంద్రగిరి కోటలో, 11న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో, 17న శ్రీకాళహస్తిలో, 19న తిరుమల ఆస్థాన మండపంలో ఈ తరహా ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అటు పర్యాటకాన్ని, ఇటు యోగాను ప్రచారం చేసేలా ఈ కార్యక్రమాలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే ఇంటింటి సర్వేతో ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. మరోవైపు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో వివిధ శాఖలతో పాటు టీటీడీ, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నట్లు వివరించారు.

15న తిరుమలలో స్టేట్ ఈవెంట్

తిరుమలలో జూన్ 15వ తేదీన స్టేట్ లెవల్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను.. ఒక్కో ప్రత్యేక వర్గంతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో క్రీడా, సినిమా, సంగీత, సేవా రంగాలలోని ప్రముఖులతో తిరుమలలో సెలెబ్రిటీ యోగా డే నిర్వహిస్తామన్నారు. ప్రముఖులతో పాటు కనీసం ఐదు వేల మంది భక్తులు పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కన్నెర్రజేసిన కడలి

విద్యార్థిని మింగేసిన అలలు - శ్రీనివాససత్రంలో బాలిక మృతి



పల్లవి (ఫైల్‌ఫొటో)

కోట, మే 28 (ఆంధ్రజ్యోతి): కడలి కన్నెర్రజేసింది... సరదాగా గడిపేందుకు తల్లితో కలిసి సముద్ర తీరానికి వెళ్లిన బాలికను అలల రాకాసి మింగేసింది. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రం గ్రామానికి చెందిన లక్ష్మయ్య, సౌమ్య దంపతుల కుమార్తె పల్లవి(12) ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యంలోకి జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక బుధవారం గ్రామంలోని మరో ముగ్గురు స్నేహితులతో పాటు తల్లితో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వెళ్లింది. సుమారు రెండు గంటలపాటు తీరంలో ఉల్లాసంగా గడిపారు. ఒక్కసారిగా భారీ అలలు వచ్చి ఒడ్డున ఉన్న పల్లవి సముద్రంలోకి లాక్కెళ్లాయి. అక్కడే ఉన్న తల్లి తన బిడ్డ సముద్రపు నీళ్లలో కొట్టుకుపోతుండడంతో హతాశులయ్యారు. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో స్థానికంగా ఉన్న గజఈత గాళ్లు పడవలు, బోట్లతో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. గంటన్నర తరువాత ఒడ్డుకు చేరిన పల్లవిని గుర్తించి ఆఘమేఘాలపై చిల్లకూరు మండలంలోని చింతవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గూడూరు ప్రభుత్వాస్పత్రి తరలిస్తుండగా మృతి చెందింది. గ్రామంలో ఆడుతూ పాడుతూ అందరినీ అలరించే పల్లవి మృతితో శ్రీనివాససత్రంలో విషాద చాయలు అలుముకున్నాయి.







నడక మార్గానికి సమీపంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ - కెమెరా ట్రాప్స్ పనితీరును పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

భక్తుల సంరక్షణే లక్ష్యంగా పనిచేయండి

● నడకమార్గాల్లో నిరంతర నిఘా ఉండాలి

● అటవీశాఖ అధికారులకు అదనపు ఈవో ఆదేశం



ఎస్‌ఎస్ టెంపుల్ వద్ద ఫారెస్ట్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఈవో

తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తుల సంరక్షణే లక్ష్యంగా ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. వన్యమృగాల బారినపడి ఏ భక్తుడికి హాని జరగడానికి వీల్లేదన్నారు. నడక మార్గాలతో పాటు ఘాట్‌రోడ్లలో నిరంతర నిఘా ఉంచాలన్నారు. వరుస చిరుతల సంచారం నేపథ్యంలో బుధవారం ఆయన అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం(ఎస్‌ఎస్ టెంపుల్) వద్ద తనిఖీలు నిర్వహించారు. చిరుతల సంచారం అధికంగా ఉండే ఏడోమైలు నుంచి ఎస్‌ఎస్ టెంపుల్ వరకు నడకమార్గానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. వాటి పనితీరు గురించి ప్రభుత్వ అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. స్టాటిక్ కెమెరాలు, మోషన్ సెన్సార్ కెమెరాలు ఎలా ఉపయోగపడుతున్నాయనేది తెలియజేశారు. ఈనెల 21వ తేదీన ఎస్‌ఎస్ టెంపుల్ వద్ద కెమెరాకు చిక్కిన ఓ చిరుత దృశ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సోలార్ కెమెరాలకు బూస్టర్లను ఫిక్స్ చేయడం ద్వారా అవి నిరంతరాయంగా పనిచేస్తాయని సూచించారు. కెమెరాల ముందు కనిపించే వన్యమృగాల సమాచారాన్ని టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాలకూ తెలియజేసి సమన్వయంగా భక్తులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులను కోరారు. అవసరమైతే మరికొన్ని కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి టీటీడీ సహకారం ఉంటుందన్నారు. నడక మార్గాల్లో భద్రతా సిబ్బందిని పెంచాలన్నారు.

చిరుతను ఢీకొన్న వాహనం

● తీవ్ర గాయాలతో పాడుపడిన కోనేరులో మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..



పాడుబడిన కోనేరు వద్ద చిరుత కళేబరం

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చిరుత.. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మామిడి తోటలో పాడుపడిన కోనేరులో మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హరిప్రసాద్‌రెడ్డి మామిడితోటలోని కోనేరులో చిరుత కళేబరాన్ని బుధవారం గొర్రెల కాపరి గుర్తించారు. ఈ సమాచారం మేరకు నాగపట్ల అటవీ సిబ్బంది కోనేరును పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో తిరుపతి ఎస్వీ జూపార్క్ వైద్యులు తోయబ సింగ్, నారావారిపల్లె వెటర్నీ డాక్టర్ వంశీ సంఘటనా స్థలంలోనే చిరుతకు పోస్టుమార్టం చేశార. ఇది చిరుత చిరుత అని, సుమారు ఏడాది వయసు ఉంటుందని, ఎడమ వైపు మెడ దగ్గర, ఎడమ కాలు దగ్గర కమిలిన గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిరుత శరీర భాగాలు, కాళ్ళు, గోళ్ళు, దంతాలు, చర్మం, బాగానే ఉన్నాయన్నారు. వారం కిందట వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయని, మూడు రోజుల కిందట కోనేరు వద్దకు వచ్చి మృతి చెందిందనట్లుగా భావిస్తున్నారు.

'కలెక్టర్ ఇంటర్న్‌షిప్'లో చేరండి

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ గ్రాడ్యుయేట్ యువతను ఓ ప్రకటనలో కోరారు. గ్రాడ్యుయేట్లు, ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరవచ్చని తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ సైన్సెస్, డెవలప్‌మెంట్ స్టడీస్‌లోగానీ, ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. 3 నుంచి 6 నెలల కాలవ్యవధితో చేసే ఈ ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రభుత్వంలో నేరుగా పనిచేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పనితీరును నేరుగా పరిశీలించి, జిల్లా స్థాయి అధికారు లతో ముఖేకష్మై, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, ప్రభు త్వ విధానాలను విశ్లేషించడం, క్షేత్రస్థాయి సమ్యలకు పరిష్కారాలు కనుక్కోవడం తదితర కార్యకలాపాలతో ఈ ప్రోగ్రాం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు జూన్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరా రు. సంతృప్తికరంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.

అమ్మగారు వస్తున్నారహో!



బయటకు వస్తేచాలు కార్పొరేషన్ ఉద్యోగుల్లో హడల్

షాపింగ్ ఖర్చులన్నీ వీరే భరించాలట!

డబ్బుల్లేవంటే.. బెదిరింపు ధోరణిలో మాటలు



నెల్లూరు నగర పాలక సంస్థలో ఆయనో ఉన్నతాధికారి. సార్.. అంటేనే కాదు.. ఆయన సతీమణి మేడం అన్నా హడలిపోతున్నారు. ఇంటిలో నుంచి మేడం బయటకు వస్తున్నారని తెలిస్తే చాలు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల మొదలు ఆర్‌ఐల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఆమె ఎక్కడకు వెళ్లి ఏం కొంటారోనని బీతిల్లుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ఇటీవల ఆమె హ్యాండ్ క్రాఫ్ట్ తయారీ వస్తువుల కొనుగోలుకు ఓ షాపులోకి వెళ్లారు. పింగానీ ప్లేట్ల నుంచి మొక్కలు పెట్టుకునే కుండీల వరకు అన్నీ కొనుగోలు చేశారు. మొత్తం రూ.17 వేల వరకు ఖర్చయింది. ఈ మొత్తం బిల్లు చెల్లించాలని అక్కడే ఆర్‌ఐను పిలిచి ఆదేశించారు. అయితే, సదరు ఆర్‌ఐ వద్ద అంత నగదు లేకపోవడం మేడం గారిలో ఆగ్రహం తెప్పించింది. 'మా ఆయన నీకు ఆర్‌ఐగా పోస్టింగ్ ఇప్పిస్తే ఆ మాత్రం ఖర్చుపెట్టలేవా!?' అంటూ మండిపడ్డారు. దీంతో సదరు అధికారి చేసేది లేక స్నేహితుల వద్ద నగదు తెప్పించుకుని షాపు యజమానికి చెల్లించాడు. కాగ ఆ వస్తువులన్నిటినీ ప్రత్యేక వాహనంలో తన అమ్మగారింటికి తరలించడం గమనార్హం.

● ఇంట్లో 20 మందితో సేవలు

కార్పొరేషన్‌కు చెందిన ఆ అధికారి నివాసం ఉంటున్న ఇంట్లో 20 మంది సిబ్బందితో సేవలు చేయించుకుంటున్నట్లు సమాచారం. కేవలం వంట కోసమే మధ్యాహ్నం వరకు నలుగురు, మధ్యాహ్నం నుంచి మరో నలుగురు ఉండగా, మరుగుదొడ్ల శుభ్రతకు ఒకరు, గార్డెన్ క్లీనింగ్‌కు మరొకరు, ఇల్లు శుభ్రతకు ఓ మహిళ, అధికారి అవసరాలకు మరో ఇద్దరు, పాత్రలు శుభ్రం చేసేందుకు ఏకంగా నలుగురు, వాచ్‌మెన్‌లుగా ముగ్గురు కొనసాగుతున్నారు. వీరంతా కార్పొరేషన్ ఖజానా నుంచి జీతాలు పొందుతుండటం విశేషం.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



నెక్లెస్ రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితరులు

ఆరోగ్య యోగా

'యోగాంధ్ర'కు విశేష స్పందన

21న 10 లక్షల మందితో యోగా : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని నెక్లెస్ రోడ్డుపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెకర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ మొదలు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. ప్రతీ ఒక్కరు యోగాను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న జిల్లాలో 10 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

- వివరాలు 6లో..

బాల యాచకులు కనిపిస్తే చర్యలు

నెల్లూరు (హరనాథపురం) :బాల యాచకులను బడిలో చేర్పించిన తర్వాత మరలా యాచక వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. తిక్కన భవన్‌లో సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. దత్తత స్వీకరణ పిల్లల విషయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీవో సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష పీడీ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ

● పాయింట్లే కీలకంగా అడుగులు

● ముగిసిన తొలిదశ ప్రక్రియ

● జిల్లాలో 6,106 దరఖాస్తులు



ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ నెలకొంది. ఉద్యోగోన్నతులు, బదిలీల్లో పాయింట్లే కీలకంగా మారడంతో ఎవరికి వారు పాయింట్ల కోసం అన్ని రకాల దరఖాస్తులను సమర్పిస్తుంచారు. వీరిలో కొందరికి నెగటివ్, మరికొందరికి పాజిటివ్ పాయింట్ల కేటాయింపులతో టీచర్లు తాము కోరుకున్న స్థానం దక్కుతుందో లేదో అన్న ఆందోళనలో ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం కాకుం డా కొంత ఆలస్యం కావ డం, అభ్యంతరాలు వస్తుండటంతో అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందోనంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతానికి దరఖాస్తులు ప్రక్రియ మొ త్తం పూర్తయిందని, తదుపరి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని చెబుతున్నారు.

- వివరాలు 6లో..

ఎస్‌ఏల ఉద్యోగోన్నతుల్లో గందరగోళం

● కౌన్సెలింగ్ నేటికి వాయిదా

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : బుధవారం జరగా ల్సిన స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియలో గందర గోళం నెలకొంది. షెడ్యూల్ ప్రకారం మంగళవారమే హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడం, బుధవారం కూడా చేపట్టడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతులు నిలిచి పోయాయి. కౌన్సెలింగ్ నిర్వహించే దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల వద్దనే రాత్రి వరకు ఎస్‌ఏలు ఎదురుచూపులు చూశారు. హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన తరువాత వారికి ఆర్జేడీ కార్యాలయం నుంచి స్థానాల కేటాయింపుల ఉత్తర్వులు వెలువడాలి. అయితే బుధవారం కూడా ఈ ప్రక్రియ జరగడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతలకు ఆటంకం ఏర్పడింది. హెచ్‌ఎంల ఉత్తర్వులు అనంతరం ఖాళీ అయ్యే స్థానాలను ప్రకటిస్తే ఎస్‌ఏలు ఆయా స్థానాలకు ఆప్షన్ ఎంచుకుంటారు. అయితే అధికారులు ముందస్తు ఆలోచన లేకపోవడం, అభ్యంతరాలు అధికమవడంతో షెడ్యూల్ ప్రకారం కాకుండా ప్రతిరోజూ ఆలస్యంగానే ఈప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఎస్‌ఏలకు సంబంధించి జడ్పీ యాజమాన్యంలో 89 మంది, ప్రభుత్వ యాజమాన్యంలో 8 మంది, మున్సిపాలిటీలో 4 కలిపి 101 ఉద్యోగోన్నతుల ప్రక్రియను బుధవారం రాత్రి నిలిపివేశారు. ఈ కౌన్సెలింగ్‌ను గురువారం నిర్వహిస్తామని అధికారులు అప్పటికప్పుడు ప్రకటించడంతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉంచి తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన చెందారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

విధుల్లో అలసత్వం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో జి.మోక్షిత అనే విద్యార్థినికి సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 84 మార్కులు రావాల్సి ఉండగా 21 వేసినందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ మనుబోలు జడ్పీ స్కూల్ ఎస్‌ఏ ఎ.శాంతిని, స్పెషల్ అసిస్టెంట్ కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ యూపీ స్కూల్ ఎస్‌జీటీ వి.సురేష్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

తెలుగులోనే పాఠాలు చెప్పాలి

● తెలుగు ఉపాధ్యాయుల విన్నపం

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు తెలుగు భాషను బోధన మాధ్యమంగా అమలు చేయాలని తెలుగు ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో బాలాజీ రావుకు వినతిపత్రం అందజేశారు. తెలుగు భాష విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. మాతృభాష లేకుంటే తెలుగు విద్యార్థుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ప్రస్తుత బదిలీల్లో తెలుగు ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీంద్ర, సాగర్ మహేష్, పెంచలయ్య, హజరత్తయ్య, శ్రీనివాసులు, మండవ శ్రీనివాసులు, షేక్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

అగ్రిగోల్డ్ భూముల్లో సీఐడీ అధికారుల పరిశీలన



తిరుమలాపురంలో జామాయిల్ తోటలను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

ఉదయగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి) : తిరుమలాపురం గ్రామంలోని అగ్రిగోల్డ్ భూముల్లో అక్రమంగా జామాయిల్ నరికివేయడంపై బుధవారం సీఐడీ సీఐ రాజేష్‌కుమార్, ఎస్‌ఐ రాజు పరిశీలించారు. నరికిన జామాయిల్ కర్రను, కర్ర లోడుతో ఉన్న మూడు లారీలను వారు పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో జామాయిల్ నరికిన ప్రాంతాన్ని సర్వే చేయించారు. 139, 140, 145 సర్వే నెంబర్లలో జామాయిల్ నరికినట్లు గుర్తించారు. ఇత్తడి శ్రీనివాసులు అనే వ్యక్తి జామాయిల్ కర్ర నరికేందుకు తమను పిలిచాడని, తమకు ఏ పాపం తెలియదని సీఐడీ అధికారుల ముందు కూలీలు వాపోయారు. దీంతో సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ పరిశీనలలో సీఐడీ పోలీసులు రాజశేఖర్, మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పట్టా ఒకరిది... వెబ్‌ల్యాండ్‌లో మరొకరికి
న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు
9 నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు


తహసీల్దారు కార్యాలయం ఎదుట వెంకటయ్య దంపతుల నిరసన

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెట్లూరు గ్రామానికి చెందిన వెంకటయ్యకు సర్వే నెం. 122-4లో 0.53 సెంట్ల పట్టాభూమి ఉంది. దీనిపై ఖాతా నంబరు 120తో పట్టాదారు పాస్ పుస్తకం కూడా ఉంది. అయితే ఇందులో 36సెంట్లు త్రివిక్రమరావు పేరుమీద వెబ్ ల్యాండ్‌లో నమోదై ఉంది. దీన్ని గుర్తించిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ తొమ్మిది నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను కోరగా... వెబ్‌ల్యాండ్‌లో 33సెంట్లు త్రివిక్రమ రావు పేరు మీద ఉందన్నారు. అతని వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకుని రావాలని వీఆర్వోను ఆదేశించామని చెప్పారు. రికార్డులు పరిశీలించి బాధితులకు తగు న్యాయం చేస్తామని తెలిపారు.

నిడిగుర్తి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు


హెల్త్ రికార్డు నమోదును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

వాకాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో బాలకృష్ణనాయక్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని వైద్యులకు సూచించారు. రికార్డులను ఆన్‌లైన్ చేయడంలో వెనుకబడి ఉండటంతో మెరుగుపరచాలని డాక్టర్ శశికుమార్‌కు సూచించారు. ఆస్పత్రిలో మరో డాక్టర్‌ను నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గూడూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మస్తానమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యతా యాత్రను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న సమైక్యతా యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీవీ రమణయ్య, శివకుమార్, శంకరయ్య, మధు, మణి, ప్రసాద్, రమేష్, నాగేంద్ర, సుధాకర్, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన


ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కూడళ్లలలో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఆర్‌టీ మెడికల్ అధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగివుండేలా వీధి నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కలుషితమైన సిరంజీలు, రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ సంక్రమించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ప్రకాష్, జయచంద్ర, జయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తూకాల్లో తేడాలొస్తే చర్యలు


రేషన్ డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల్లో పంపిణీ చేసే రేషన్ బియ్యం తూకాల్లో వ్యత్యాసం వస్తే చర్యలు తప్పవని తహసీల్దారు రామయ్య అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను రద్దుచేసి పాత పద్ధతిలోనే రేషన్ సరుకుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేయాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్స్ డీటీ మల్లికార్జున్‌రావు, పౌర సరఫరాల గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ అఖిల్‌యాదవ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 'ప్రయోగశాల నుంచి నేలకు' అనే నినాదంతో ఖరీఫ్‌లో రైతులు అధిక ఆదాయాన్ని పొందడానికి చర్యలు చేపట్టిందన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు హాజరుకావడానికి బుధవారం సూళ్లూరుపేట టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో దంతాల రవి, కుదిరి పెంచలయ్య, ఏడుకొండలు, మేడా సాయినారాయణ, ఆరణి చంద్రమోహన్ తదితరులు తరలివెళ్లారు.


మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

చిల్లకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అదానీ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి రాజేస్‌రంజన్ అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వేరుశనగ రిటైల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను రిటైల్ మార్కెటింగ్ చేయడంపై మహిళలకు అవగాహన కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కోటేశ్వరమ్మ, జగదీష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కోట, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని క్రాస్‌రోడ్డు, శ్యామసుందరపురం, ఆంజనేయస్వామి గుడివీధి, వెంకన్నపాళెం గ్రామాల్లోని చౌక దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రావు తనిఖీ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, నిత్యావసర సరుకులు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో చౌక దుకాణాలను డీటీ తనిఖీ చేశారు. ఆయన వెంట వీఆర్వో కన్నా వెంకటరమణయ్య ఉన్నారు.


చిల్లకూరులో పచ్చనిదుప్పటి పరిచినట్లు కనువిందు చేస్తున్న వరిపైరు

పుడమికి పచ్చకోక కట్టినట్లు..

పెళ్లకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు ముందుగానే ప్రవేశించడంతో పది రోజులుగా కురుస్తున్న వర్షాలు వరిపైరుకు జీవం పోస్తున్నాయి. పెళ్లకూరు మండలంలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంతో పాటు తెలుగుగంగ కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో పునబాక, చెంబేడు, అర్ధమాల, పెళ్లకూరు, చిల్లకూరు, పుల్లూరు, పనుపుకండ్రిగ, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, పెరుమాళ్లపల్లి, చావాలి, పెన్నేపల్లి, కప్పగుంటకండ్రిగ, జీలపాటూరు, కొత్తూరు, రావులపాడు, నెలబల్లి, బీమవరం తదితర గ్రామాల్లో ఎడగారు వరిసాగు చేపట్టారు. తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి వరకు 71వ జాతీయ రహదారికి ఇరువైపులా పచ్చదనం సంతరించుకుని కనువిందు చేస్తోంది.




నాయుడుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు - గూడూరు, కోటలో టీడీపీ నాయకుల నివాళి

బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

నాయుడుపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజల్లో సైతం రాజకీయ చైతన్యాన్ని రగిలించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిన మహనీయుడు, బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెసల కిషోర్‌బాబు, రఫీ, నెల వల రాజేష్, కట్టా రమణారెడ్డి, నానాబాల సుబ్బారావు, పసల గంగా ప్రసాద్, నారాయణ, రవి, అవధానం సుధీర్, నిత్యకృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, జువ్వలపాటి మస్తాన్, అన్నమనేని సాయి, సుబ్రహ్మణ్యం, భాస్కర్, చెంచయ్య, శేషం మునిగోపీ, లోకనాథం, గుంటూరు లక్ష్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక గమళ్లపాళెం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, జనార్దనరెడ్డి, పెంచలయ్య, నరసరాజు, తూపిలి సురేంద్ర, వేముల సునీల్, అరుణ్, పార్వతయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని వెంకన్నపాళెంలో టీడీపీ బూత్ కన్వీనర్ వీరయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. వెంకన్నపాళెం, వీరారెడ్డి సత్రం, తాటితోపు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉలస శీనయ్య, ముచ్చకాయల పవన్‌కుమార్, విన్నమాల శ్రీకాంత్, వంకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, ఎంఈవో జగదీష్‌బాబు, ఈవోపీఆర్డీ అల్లాభక్షు నివాళులర్పించారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో చిట్టేటి పెరుమాల్, నాపా మునిరాజా, వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు, బండారు ఆంజనే యులు, మెస్ రమణయ్య, మార్కొండేయులు, గండవరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మురళీకృష్ణ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

తడ: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కామిరెడ్డి మురళీరెడ్డి, నీలకంఠం, నాయకులు శివాజీ, మనోహర్, జీవ, రమేష్, ఏడుమలై తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈవోపీఆర్‌డీ విజయకుమార్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, సురేష్, శేఖర్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకాడు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు నివాళులర్పించారు. డీటీ సందీప్, ఆర్‌ఐ అఖిల్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సతీష్ కుమార్, డీటీ నిరంజన్ కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.





సూళ్లూరుపేటలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు వేనాటి సతీష్ రెడ్డి, పెరుమాల్, రమేష్, శ్రీనివాసులు తదితరులు - డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఎంఈవో జగదీష్ బాబు - వాకాడు రెవెన్యూ కార్యాలయంలోతహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, చిట్టమూరు ఉంపీడీవో కార్యాలయంలో అధికారుల నివాళులు

రైతులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లిస్తాం: జేసీ


రైతులతో మాట్లాడుతున్న జేసీ శుభమ్ బన్సల్

పెళ్లకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ పేర్కొన్నారు. బుధవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారికి భూములిచ్చిన తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, చిల్లకూరు రైతులతో జేసీ సమావేశమయ్యారు. నాయుడుపేట పట్టణానికి సమీపంలో ఉన్న తాళ్వాయిపాడు, పెన్నేపల్లి రెవెన్యూ పరిధిలోని భూములకు తగిన పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. జేసీ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులందరికీ ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం న్యాయబద్ధమైన పరిహారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీజేపీతోనే హిందూ మతానికి ప్రమాదం: సీపీఐ

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే హిందూ మతానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి అన్నారు. బుధవారం సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటనకు నిఘా వైఫల్యమే కారణమన్నారు. కశ్మీర్ సమస్యను బూచిగా చూపించి పాకిస్థాన్‌తో యుద్ధంగా చేయాలనే ఆలోచన మంచిది కాదన్నారు. దేశంలో మతం పేరుతో దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, నాయకులు పార్థసారధి, నాగేంద్ర, ఆనంద్, శ్రీనివాసులు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి, పక్కన సుధాకరరెడ్డి, పెంచలయ్య తదితరులు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, మోహన్, శ్రీనివాసులు, కరిముల్లా, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుపై పునఃపరిశీలన

డక్కిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇంటి పట్టాల పునఃపరిశీలన త్వరగా పూర్తి చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు వీఆర్వోలను ఆదేశించారు. బుధవారం ఆయన వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. జగన్న కాలనీల్లో 447 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో కొంత మంది బినామీలు ఉన్నట్లు ఫిర్యాదులు అందడంతో రీ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు.

1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు

గూడూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో గూడూరు పట్టణ, మండల పరిధిలోని 63 రేషన్ దుకాణాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాటాలను, ఈ - పాస్ మిషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారానే సరుకులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ నరసింహారావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు.

కాలువలోకి ఒరిగిపోయిన లారీ

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని ఫ్లైఓవర్ నుంచి రాఘవయ్యపేటకు వెళ్లే రోడ్డులో ఓ లారీ సైడ్ కాలువలోకి ఒరిగిపోయింది. ఫ్లైఓవర్ బ్రిడ్జికి అనుకొని ఉన్న రోడ్డులో ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ సైడ్ కాలువలో ఒరిగిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని బయటకు తీశారు.

నేడు హజరత్ ఖాదర్‌షావలి గంధోత్సవం

నాయుడుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నదర్గా హజరత్ ఖాదర్‌షావలి (ఉరుసు) గంధోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరంలో అదనపు గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దనరెడ్డి, మురళీరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, యుగంధర్, రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలి


నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డులో వల్లివేడు క్రాస్ వద్ద మహిళలు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలంటూ బుధవారం నిరసన తెలిపారు. వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద సుమారు 50 కుటుంబాలు ఉంటున్నాయని, తాము మనులాల పేటలో ఉన్న రేషన్ షాపు వద్ద సరుకులు తీసుకోవాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రేషన్ బియ్యం కోసం వెళ్లితే ఒక రోజు కూలి పని మానుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.





మహానాడులో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో గూడూరు, కోట, వాకాడు మండలాల నేతలు - పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డితో కలిసి మాజీ మంత్రి పరిటాల సునీతకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ